ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ సంపుటి: 19 సంచిక : 77 బుధవారం 19, నవంబర్ 2025 పేజీలు: 08 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com



# మోడీ దేశానికి బడే భాయ్

## తెలంగాణ దేశానికి ఆదర్శంగా ఉండాలని మా ప్లాన్

2047 విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేశామన్నారు
3000 ఎలెక్ట్రిక్ బస్సులు నడపాలని ప్లానింగ్
తెలంగాణ ప్రాజెక్టులకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కోరిన ముఖ్యమంత్రి
ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలన్న రేవంత్ రెడ్డి
గుజరాత్‌కు మోదీ ఇచ్చిన సహకారాన్నే మేమూ కోరుతున్నాం
ఆర్థికంగా ఎదిగిన దేశంగా భారత్‌ను అభివృద్ధి చేసేందుకు కేంద్రం కృషి చేస్తోందన్న సీఎం

**హైదరాబాద్, నవంబర్ 18(ప్రజాస్వరం):** దేశానికి పెద్దన్నగా ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకరిస్తే అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ..మిగతా 2లో



# అధైర్యపడకండి... అండగా ఉంటాం

## 21న జాతీయ రహదారుల దిగ్బంధం

పత్తి, సోయాబిన్ పంటలను వెంటనే కొనాలి
పత్తి రైతులకు అండగా ప్రభుత్వం నిలవాలి
ఆదిలాబాద్ పత్తి మార్కెట్ సందర్శించిన కెటిఆర్
మళ్లీ వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనన్నకెటిఆర్

**హైదరాబాద్, నవంబర్ 18(ప్రజాస్వరం):** అన్నదాతలకు మద్దతుగా ఈ నెల 21న జాతీయ రహదారుల దిగ్బంధం నిర్వహించనున్నట్లు కెటిఆర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ అన్నదాతలు భారీగా తరలి రావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ..మిగతా 2లో

# తుమ్మల లాంటి నేతలను వదులుకోవడం తప్పే

## అందుకే బిఆర్ఎస్ మూడోసారి మట్టి కరిచింది

తెలంగాణలో ప్రతిపక్షం అన్నింటా ఫెయిల్
బీఆర్ఎస్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదన్న కవిత
కుట్ర చేసి బయటకు పంపారని ఆరోపణ
ప్రస్తుతానికి కొత్త పార్టీ ఆలోచన లేదని వెల్లడి
భవిష్యత్తులో తామే బాధ్యతాయుత ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని ప్రకటన

**హైదరాబాద్, నవంబర్ 18(ప్రజాస్వరం):** రాష్ట్రంలో అధికార పక్షం, ప్రతిపక్షం బాధ్యతగా వ్యవహరించటంలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ..మిగతా 2లో



# నీతీశ్‌లా బిహార్‌ను అర్థం చేసుకోలేకపోయా!

బీహార్ ఎన్నికల ఓటమికి పూర్తి బాధ్యత తనదేనన్న ప్రశాంత్ కిశోర్
ప్రజల నమ్మకాన్ని గెలవడంలో విఫలమయ్యామని అంగీకారం
ప్రాయశ్చిత్తంగా ఈ నెల 20న మౌన ఉపవాసం చేయనున్నట్లు ప్రకటన




# కరెంటు నుంచి కాంట దాకా అన్నీ సమస్యలే



పత్తికి మద్దతు ధర ఇచ్చి కొనాలి
ఢిల్లీకి వెళ్లి పత్తి సమస్యలు ప్రధానికి తెలిపాలి
లేదంటే సిఎం ఇంటిముందే పత్తిపోసి ధర్నా చేస్తా
వరంగల్ ఎనుముల మార్కెట్ సందర్శించిన హరీష్ రావు

**హైదరాబాద్, నవంబర్ 18(ప్రజాస్వరం):** పత్తి రైతుకు మద్దతు ధర ఇవ్వకపోతే తెల్ల బంగారాన్ని రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ప్యాలస్ ముందు పోసి ఇంటిని ముట్టడిస్తామని ముఖ్యమంత్రి ..మిగతా 2లో

# ఐబొమ్మ రవి కేసులో ఈడీ రంగప్రవేశం

ఐ-బొమ్మ కేసు దర్యాప్తులోకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్
మనీలాండరింగ్ కోణంలో విచారణకు ఈడీ సిద్ధం
బెట్టింగ్ యాప్స్, క్రిప్టో వాలెట్ల ద్వారా నిధుల సమీకరణ
నిందితుడి ఖాతాలోని రూ.3.5 కోట్లను ఇప్పటికే ఫ్రీజ్ చేసిన పోలీసులు




**హైదరాబాద్, నవంబర్ 18(ప్రజాస్వరం):** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఈ కేసులో భారీగా ఆర్థిక అవకతవకలు, మనీలాండరింగ్ జరిగినట్లు అనుమానిస్తున్న ఈడీ, లోతైన దర్యాప్తు చేపట్టేందుకు ..మిగతా 3లో

# ఐబొమ్మ రవి కేసులో భావోద్వేగం..

తక్కువ శిక్ష పడేలా చూడాలంటూ తండ్రి కన్నీటి విజ్ఞప్తి
తన కొడుకు చేసింది తప్పేనన్న ఐబొమ్మ రవి తండ్రి అప్పారావు
మనవరాలి భవిష్యత్తు గురించే నా ఆందోళన అని వెల్లడి
రవికి తక్కువ శిక్ష పడేలా చూడాలని అధికారులకు విజ్ఞప్తి




## సీజేఐ పై జరిగిన దాడిపై రాష్ట్రపతికి

# ఫిర్యాదు చేస్తాం

రాజ్యాంగంలో ఉన్న వ్యవస్థలు విధి నిర్వహణలో విఫలం అయ్యాయి
సీజేఐపై జరిగిన దాడిని ప్రపంచం చూసింది
సీజేఐపై దాడి దేశంలో ఉన్న దళితులపై జరిగిన దాడిగా చూస్తున్నాం.
ఎమ్మార్పీఎస్ అధినేత 'పద్మశ్రీ ' మంద కృష్ణ మాదిగ



**ఢిల్లీ నవంబర్ 18(ప్రజాస్వరం):** సీజేఐ బిఆర్ గవాయ్ పై జరిగిన దాడి మీద త్వరలోనే రాష్ట్రపతిని కలిసి పిర్యాదు చేస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు 'పద్మశ్రీ 'మందకృష్ణ మాదిగ ..మిగతా 3లో

# పంతాలకు పోయి.. ప్రాణాలు తీసుకోవద్దు..




అర్బన్ నక్సలైట్లను నమ్మి మోసపోకండి
ఏ పార్టీ అధికారంలో ఉన్నా అర్బన్ నక్సలైట్లు పైరవీలు చేసుకుంటారని ఆరోపణ
అర్బన్ నక్సలైట్ల మాటలు నమ్మి అమాయక పేదలు తుపాకీ పట్టి అడవుల్లో తిరుగుతున్నారని విమర్శ
మావోయిస్టులకు బండి సంజయ్ పిలుపు


# హిడ్మా హతం

మావోయిస్టులకు మరో ఎదరుదెబ్బ
ఎన్‌కౌంటర్‌లో పార్టీ అగ్రనేత హిడ్మా ఔట్
ఎదరుకాల్పుల్లో మొత్తం ఆరుగురు మావోల హతం
అమిత్ షా విధించిన గడువుకు 12 రోజుల ముందే ఆపరేషన్ సక్సెస్
అల్లూరి జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భీకర కాల్పులు
నక్సలిజం నిర్మూలనే లక్ష్యంగా కేంద్రం ఆపరేషన్
హిడ్మా మృతిని ధృవీకరించిన ఏపీ డీజీపీ



**హైదరాబాద్, నవంబర్ 18(ప్రజాస్వరం):** మావోయిస్ట్ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే అనేకమంది లొంగిపోగా, పలువురు అగ్రనేతలు పోలీస్ తూటాలకు బలయ్యారు. తాజాగా మరో ..మిగతా 3లో

# జంగిల్ రాజ్ పాలనకు పరాకాష్ట!





ఫేక్ ఎన్‌కౌంటర్స్ చేయడం విచారకరం
కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు జంగిల్ రాజ్ పాలనకు పరాకాష్ట
పోలీసులు కూడా ఇందులో పావులుగా మారారు



# కాంగ్రెస్ పాలనలో కరెంటు నుంచి కాంట దాకా అన్నీ సమస్యలే

మొదటిపేజీ తరువాయి

రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీష్ రావు వార్నింగ్ ఇచ్చారు. మంగళవారం ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను హరీష్ రావు, బీఆర్ఎస్ నేతలు పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... పత్తి కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వైఖరితో రైతులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. సీసీఐ తుగ్లక్ చర్యల వల్ల రైతులు రోడ్డున పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు విధిలేక దళారులకు అమ్ముకుంటున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలను నిలువునా ముంచుతున్నాయని మాజీ మంత్రి విమర్శించారు. రేవంత్ రెడ్డి అరవైసార్లు ఢిల్లీకి వెళ్లారని.. మూటలు పంపుతున్నారు గానీ రైతుల సమస్యలు బడే బాయ్‌కు చెప్పరా అని ప్రశ్నించారు. జూబ్లీ హిల్స్‌లో విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు పెట్టారని.. మరి రైతులకు మద్దతు ధర ఇప్పించరా అంటూ నిలదీశారు. కపాస్ యాప్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎనిమిది మంది తెలంగాణ బీజేపీ ఎంపీలకంటే పంటపొలాల్లో దిష్టి బొమ్మలు నయమంటూ వ్యాఖ్యలు చేశారు. విదేశాల నుంచి పత్తి దిగుమతి చేసుకునేందుకు నిబంధనలు సడలించారని.. కానీ రైతులకు మాత్రం న్యాయం చేయడం లేదని మండిపడ్డారు. ఇప్పటి వరకూ 406 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. రైతులు కన్నీళ్లు పెట్టుకుంటుంటే సీఎం రేవంత్ రెడ్డి విజయోత్సవాలు జరుపుతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తుఫానుతో పంటలు నష్టపోయిన రైతులకు రేవంత్ రెడ్డి సర్కార్ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మేల్కొని రైతులకు న్యాయం చేయాలని మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. కాగా.. హరీష్ రావుతో పాటు పత్తియార్డును బీఆర్ఎస్ నేతలు ఎర్రబెల్లి దయాకర్ రావు, మధుసూదనాచారి, చల్లా ధర్మారెడ్డి, మాలోత్ కవిత పరిశీలించారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు నుంచి కాంట దాకా అన్నీ సమస్యలేనని ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. సమయానికి ఎరువులందవు, కరెంటు సరిగ్గా రాదు, రైతుబంధు రాదు, రుణమాఫీ లేదు, బోనస్, పంటల బీమా ఊసేలేదని మండిపడ్డారు. వరంగల్ డిక్లరేషన్‌లో చెప్పిన ఒక్క హామీ అయిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందా అని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లు, కార్పొరేట్లకు లాభం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తుందని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి మేలుకోకపోతే తెల్ల బంగారం పత్తిని తెచ్చి జూబ్లీహిల్స్ ప్యాలెస్ ముందు పోస్తామని హెచ్చరించారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తుందన్నారు. వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌ని సందర్శించాక పత్తి రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. రాష్ట్రంలో పత్తి రైతులు తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారు. తెలంగాణలో 50 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరుగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల, బీజేపీ తప్పుడు విధానాల వల్ల పత్తి రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. సీసీఐ తుగ్లక్ వంటి పిచ్చి నిర్ణయాలు తీసుకొని రైతులను ఇబ్బందుల గురి చేస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా జిన్నింగ్ మిల్లులన్నీ రెండు రోజులుగా మూతపడ్డాయి. పత్తి రైతులంతా అయోమయంలో ఉన్నారు. ఈరోజు రైతులకు పత్తిని అమ్ముకోవడానికి అవకాశం లేక అడ్డగోలుగా దళారులకు అమ్ముకునే పరిస్థితి వచ్చింది. పత్తికి మద్దతు ధర రూ. 8,100. కానీ, రూ.6 వేలకే రైతులు అమ్ముకునే పరిస్థితి ఏర్పడిరది. క్వింటాల్ మీద రూ.2000ల చొప్పున పత్తి రైతులు నష్టపోతున్నారు. మాటల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరచేతిలో వైకుంఠం చూపించి, చేతల్లో నరకం చూపిస్తున్నాయని అన్నారు. వరదలు, తుఫాన్‌ల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతే తుగ్లక్ నిర్ణయాలతో మరింత ఇబ్బంది పెట్టడం సరికాదు. ఒకవైపు అకాల వర్షాలతో పంట దిగుబడి తగ్గిపోయింది. పంట చేనులన్నీ దెబ్బతిన్నాయి. పెట్టిన పెట్టుబడులు రాక రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చింది. ఎల్ వన్, ఎల్ టు, ఎల్ త్రీ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. 8 నుంచి 12 శాతం తేమ విధానాన్ని సవరించి, కపాస్ యాప్ ని రద్దు చేయండి. స్మార్ట్ ఫోన్లు లేకపోవడం వల్ల కపాస్ యాప్‌లో నమోదు చేయడం రైతులకు కష్టమైన పని. గత సంవత్సరం లాగానే 12 క్వింటాల పత్తి కొనాలని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. బీజేపీ ఎంపీలు ఒక్కసారి కూడా నోరు విప్పరు. రైతుల గురించి కేంద్ర ప్రభుత్వాన్ని అడగరు. కేసీఆర్‌ని, బీఆర్ఎస్‌ని తిట్టడం తప్ప బీజేపీ ఎంపీలకు మరో పని చాతకాదు. కాంగ్రెస్ ప్రశ్నించదు. బీజేపీ అడగదు అంటూ మండిపడ్డారు. రైతులను తీవ్రంగా ఇబ్బందులు పెట్టినందుకు విజయోత్సవాలు చేస్తున్నారా?. యూరియా బస్తాల కోసం రైతులను లైన్‌లో నిల్చోపెట్టినందుకు విజయోత్సవాలా?. ములుగు నియోజకవర్గంలో చింతకుంట, మంగపేట మండలాల నుంచి వచ్చిన రైతు వెంకటేశ్వర్లు, రైతు లక్ష్మయ్య మక్కలు అమ్మడానికి ఎనుమాముల మార్కెట్‌కి వచ్చారు. క్వింటల్ మక్కలు రూ.1800 కు రైతులు అమ్ముతున్నారు, రూ.2400 మక్కకు మద్దతు ధర. మక్క రైతులు ఒక క్వింటాలకు రూ.570 నష్టపోతున్నారు. ఎవరికైనా మక్క రైతులకు పైసలు విడుదల చేశారా అని మార్క్ ఫెడ్ అధికారులను అడిగితే.. రాష్ట్ర ప్రభుత్వం ఒక రూపాయి కూడా విడుదల చేయలేదని సమాధానం ఇచ్చారు. పోయిన యాసంగిలో రైతులకు రావలసిన రూ.1,100 కోట్ల బోనస్‌ని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం ఈ సంవత్సరం కొన్న రైతులకు కూడా రూ.1,400 కోట్ల బకాయిలు పడ్డాయి. పంటల భీమా తెస్తామన్న కాంగ్రెస్ పార్టీ రెండేళ్లు అయినా పంటల బీమాను రైతులకు అందించడంలో విఫలమైంది. పంటల బీమా ఉండి ఉంటే నష్టపోయిన పంటకు రైతులకు నష్ట పరిహారాలు అందేది కదా. బోనస్ ఎగ్గొడివితి. రైతుబంధు రెండు పంటలకు ఎగబెట్టింది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. కరెంటు నుండి కాంట దాకా అన్నీ సమస్యలే. కరెంటు లోవోల్టేజ్ వల్ల ట్రాన్స్ఫార్మర్లు కాలిపోతున్నాయన్నారు. రైతుబంధు రాదు. రుణమాఫీ జరగదు. బోనస్ ఎగ బెడతావు. పంటల బీమా లేదు. ఇంతే కదా రేవంత్ రెడ్డి. వరంగల్ డిక్లరేషన్‌లో చెప్పిన ఒక్క హామీ అయిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందా? అని ప్రశ్నించారు. సిఎం రేవంత్ ఢిల్లీకి పోయి ప్రధానమంత్రిని కలిసి నిబంధనలు ఎత్తివేసి పత్తికొనే విధంగా చేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. వరంగల్ వరదల్లో 20 వేల ఇండ్లు మునిగిపోయాయి. సకాలంలో గేట్లు ఎత్తి ఉంటే వరంగల్ నగరం మునిగిపోయేది కాదు. మునిగిపోయిన ఇళ్లకు రూ. 15 వేలు ఇస్తామన్నారు. రెండు నెలలు అయింది ఒక రూపాయి ఇవ్వలేదు. వెంటనే నష్టపరిహారం విడుదల చేయాలని రేవంత్ రెడ్డిని డిమాండ్ చేస్తున్నామన్నారు.



# అధైర్యపడకండి... అండగా ఉంటాం

మొదటిపేజీ తరువాయి

పిలుపునిచ్చారు. రైతాంగం ముఖ్యంగా పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఆందోళన చేపడుతున్నామని అన్నారు. ఈ క్రమంలో కేటీఆర్ పార్టీ సీనియర్ నేతలతో కలిసి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. ఆదిలాబాద్ పట్టణంలోని మార్కెట్ యార్డులో పత్తి, సోయా రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు తమకు ఎదురవుతున్న సమస్యలను తెలియజేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడంలేదని కేటీఆర్‌కు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి రైతన్నలకు ఇచ్చిన హామీలన్నింటిని పక్కన పెట్టిందని, కనీసం పండిన పంటలను అమ్ముకోవడంలో కూడా సహకారం అందించడం లేదని తెలిపారు. రైతన్నల సమస్యల పరిష్కారానికి పోరాటాలు మాత్రమే మార్గం. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలపైన ఒత్తిడి తీసుకువచ్చేందుకు అన్ని రకాల పోరాటాలను చేసేందుకు మా పార్టీ సంసిద్ధంగా ఉన్నది. పార్టీ రైతన్నలకు అండగా ఉంటుంది. మొన్న ఆత్మహత్య చేసుకున్న హడావు దీపక్ కుటుంబానికి పార్టీ తరఫున కొంత ఆర్థిక సహాయం చేస్తాం. వెంటనే ప్రభుత్వం పంటల కొనుగోలు కోసం ఫింగర్ప్రింరట్ల నిబంధన, కేవలం 12 శాతం తేమ ఉండాలన్న నిబంధన, ఎకరానికి ఏడు క్వింటాల మాత్రమే కొంటామన్న నిబంధన ఇవన్నీటిని వెంటనే ఎత్తివేయాలి. కిసాన్ కపాస్ యాప్ సంబంధం లేకుండా పంట కొనుగోలు చేయాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

రైతులతో మాట్లాడిన అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేదు అని అంటే ఎందుకు ఈ రోజు అదిలాబాద్ మార్కెట్ యార్డ్‌ని బంద్ పెట్టారు. మార్కెట్ యార్డులో రైతన్నలను కలుస్తామంటే ప్రభుత్వం ఎందుకు అడ్డంకులు కల్పించింది. చరిత్రలో ఎప్పుడు లేనంత దారుణంగా పత్తి కొనుగోలు సోయా రైతుల పరిస్థితి మారింది. కిసాన్ కపాస్ మొబైల్ అప్లికేషన్ అని తీసుకువచ్చి దాని ద్వారానే పంటలు కొంటాం అంటున్నారు. మరి కనీసం ఫోన్లు లేని రైతన్నల పరిస్థితి ఏమిటి? ఆదిలాబాద్ జిల్లాలో మొబైల్ నెట్‌వర్క్ కనెక్టివిటీ అన్నిచోట్ల ఉండదు. మరి ఇలాంటి సందర్భంలో రైతన్నల పరిస్థితి ఏమిటో చెప్పాలి అని కేటీఆర్ అడిగారు. రాష్ట్రంలో భారీగా అకాల వర్షాలు పడినందు వలన పత్తి తేమశాతం ఎక్కువగా ఉన్నది. చలి కూడా గతంలో కంటే ఎక్కువగా ఉన్నది అందుకే పత్తిలో తేమశాతం ఉన్నది. గతంలో మా ప్రభుత్వం ఉన్నప్పుడు కేంద్రం పైన ఒత్తిడి తీసుకొచ్చి 20 నుంచి 22 శాతం తేమ ఉన్న పంటను కూడా కొనిపించాము. కానీ ఇప్పుడు కేవలం 12 శాతం తేమ ఉంటే కూడా కొనుగోలు చేయము అని చేతులు ఎత్తేసింది. రైతులు పంటలు అమ్ముకోలేక ఆత్మహత్యలు చేసుకుంటే కూడా పట్టించుకునే వారు లేరు కనీసం అడిగే వారు కూడా లేరు. కనీసం ఇప్పటిదాకా లక్ష క్వింటాళ్ల పంట కూడా కొనలేదు. ప్రైవేట్ వాళ్లతో ప్రభుత్వం కుమ్మక్కై రైతుల పంటను దోచుకుంటున్నది అని అనిపిస్తున్నది. లేకుంటే రైతన్నలకు ఎన్ని సమస్యలు వచ్చిన స్పందించకుండా ఉండదు అని కేటీఆర్ పేర్కొన్నారు. కనీస మద్దతు ధర రూ. 8,100 రైతుకు దక్కాల్సింది కానీ ఐదారు వేలు కూడా దక్కడం లేదు. సోయాబీన్ అమ్మకానికి సంబంధించి ఫింగర్ ప్రింట్ కావాలని చెప్పి ఒక నిబంధన పెట్టి అనేక ఇబ్బందులు గురి చేస్తున్నారు. సొంత తల్లిదండ్రుల పేరు మీద ఉన్న పంటలు బిడ్డలు అమ్మాలంటే కూడా కొనుగోలు చేయడం లేదు. పత్తి పంట ఎకరానికి కేవలం 7 క్వింటాళ్లు మాత్రమే కొంటామనే ఒక అర్థరహితమైన నిబంధన పెట్టారు. ఆదిలాబాద్‌లో ఉన్న భూసార పరిస్థితుల వలన పది పదిహేను క్వింటాళ్ల వరకు ఎకరానికి పండుతుంది మరి మిగిలిన పంటను ఎక్కడ అమ్ముకోవాలి. ఈరోజు మేము





రైతన్నలను కలవడానికి వెళ్తున్నామని తెలుసుకున్న ప్రభుత్వం నాటకాలు మొదలుపెట్టారు అని కేటీఆర్ మండిపడ్డారు. కేంద్రంతో వీడియో కాన్ఫరెన్స్ అంటూ నాటకాలు మొదలుపెట్టారు. కానీ నిన్న జరిగిన క్యాబినెట్లో 50 శాతానికి పైగా తెలంగాణ జిల్లాలో పండుతున్న పత్తి పంట పైన కనీసం మాట్లాడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంటు సరఫరా నుంచి మొదలుకొని యూరియా సప్లై దాకా చివరికి పంట అమ్మకానికి సంబంధించి కూడా తీవ్రమైన సమస్యలు ఉన్నాయి. రాష్ట్రంలో రైతన్నల పంటలు కొనుగోలు చేసే పరిస్థితులు కూడా లేవు. దేశంలోనే అత్యుత్తమ పంటను పండిరచే రాష్ట్రం తెలంగాణ కానీ ఇక్కడి తెలంగాణ ప్రభుత్వం మాత్రం పట్టి రైతన్నలను పట్టించుకోవడం లేదు అని కేటీఆర్ ధ్వజమెత్తారు. దేశంలో అద్భుతమైన నాణ్యత కలిగిన పత్తి పంట పండుతుంటే కేంద్రంలోని బిజెపి మాత్రం విదేశాల నుంచి పత్తిని దిగుమతి చేయించుకుంటుంది. పైగా ఇప్పటిదాకా ఉన్న దిగుమతి సుంకాలన్నింటిని ఎత్తివేసింది. కేవలం ఇతర దేశాల్లోని సరఫరాదారులతో చేసుకున్న ఒప్పందాల కోసమే తేమ శాతం, మొబైల్ అప్లికేషన్ ,ఎకరాకు 7 క్వింటాళ్ల వంటి అర్థరహితమైన నిబంధనలు పెట్టి విదేశీ సరఫరాదారులతో చేతులు కలిపేందుకే దేశంలోని రైతన్నల నుంచి బిజెపి దేశంలోని రైతన్నల నుంచి పత్తి పంట కొనుగోలు చేయడం లేదు. కేంద్రం ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకురాకుండా కేవలం ఎన్నికలు, రాజకీయాలపైన మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించడం వలన ఇన్ని సమస్యలు వచ్చాయి. ఇప్పటిదాకా పత్తి కొనుగోలు చేయాలని కనీసం కేంద్రం పైన రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురాలేదు అని కేటీఆర్ నిలదీశారు. అధిక వర్షాల వలన నష్టపోయిన రైతన్నలందరికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిహారం చెల్లించాలి. నష్టపోయిన ప్రతి రైతన్నకు ఎకరానికి 20000 చొప్పున కనీస నష్టపరిహారం చెల్లించాలని పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నాం. స్థానిక బిజెపి, కాంగ్రెస్ నేతలు తమ ప్రభుత్వాలపైన ఒత్తిడి తీసుకువచ్చి రైతన్నలకు న్యాయం చేయాలి. వెంటనే ఇక్కడి కేంద్ర మంత్రులు, తెలంగాణ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చేలా స్థానిక రైతుల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకుపోవాలి. లేకుంటే వారి పైన రైతన్నల పోరాటం తప్పదు అని కేటీఆర్ హెచ్చరించారు.

# తుమ్మల లాంటి నేతలను వదులుకోవడం తప్పే

మొదటిపేజీ తరువాయి

కవిత విమర్శించారు. ఖమ్మం జిల్లాకు చెందిన బలమైన నేత తుమ్మల నాగేశ్వరావును బీఆర్ఎస్ వదులుకోవడంతోనే మూడోసారి అధికారంలోకి రాకుండా పోయిందంటూ వ్యాఖ్యలు చేశారు. తుమ్మల బయటకు వెళ్లడంతోనే రాష్ట్రంలో గులాబీ పార్టీ పరిస్థితి తలకిందులైందన్నారు. తుమ్మలలాంటి నేతను బీఆర్ఎస్ వదులుకోవడం నూటికి నూరు శాతం పెద్ద తప్పే అని అన్నారు. తెలంగాణలో ప్రతిపక్షం ఫెయిల్ అయ్యిందని.. తన బాధ్యతను నిర్వర్తించలేకపోతోందని వ్యాఖ్యలు చేశారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్రను భవిష్యత్తులో తాము పోషించబోతున్నామన్నారు. కొత్తరాజకీయ పార్టీ గురించి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీపై విరుచుకుపడ్డారు. తనను ఏ విధంగా పార్టీ నుంచి బయటకు పంపారనే విషయాన్ని తెలియజేశారు. రాజకీయ పార్టీ గురించి ఇప్పుడప్పుడే ఆలోచన చేయటం లేదని కవిత అన్నారు. బీఆర్ఎస్‌లో నుంచి తనను సస్పెండ్ చేశారని.. ఆ పార్టీతో తనకెటువంటి సంబంధాలు లేవని స్పష్టం చేశారు. కుట్రతో బీఆర్ఎస్ నుంచి తనను బయటికి పంపించారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కొంతమంది కుట్ర చేసి తనను.. తన కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీకి దూరం చేశారన్నారు. తన జీవితంలో చిన్న పొరపాటు కూడా చేయలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు తనకు ఎక్కడా ఎటువంటి అవకాశం ఇవ్వలేదని.. కనీసం ఒక టీచర్ పోస్ట్ కూడా ట్రాన్స్ఫర్ చేయించుకోలేకపోయానని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్‌లో జాగృతి కార్యకర్తలకు అన్యాయం చేశారని... కనీస గుర్తింపు ఇవ్వలేదని కవిత సంచలన కామెంట్స్ చేశారు. కవిత ఇంకా మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమానికి ఊపిరులు ఊదిన జిల్లా ఖమ్మం జిల్లా అని జాగృతి అధ్యక్షురాలు అన్నారు. జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఖమ్మం జిల్లా పూర్తిగా మారిపోయిందని గుర్తుచేశారు. వెంగళరావు హయాంలో జిల్లా విశేషంగా అభివృద్ధి చెందిందన్నారు. ఆ తరువాత పెద్దలు తుమ్మల నాగేశ్వరావు ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని తెలిపారు. ఇప్పుడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖమ్మం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని చెప్పారు. ఖమ్మం అభివృద్ధి కోసం ఎవరి ప్రయత్నం వారు చేసినప్పటికీ పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందలేదని అన్నారు.



ఇంకా ఖమ్మం అభివృద్ధి చెందాల్సి ఉందని.. సీతారామ ప్రాజెక్టును కూడా వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సామాజిక తెలంగాణ రావాలన్నదే తన ఆశయమని.. అవకాశం, అధికారం, ఆత్మగౌరవం కోసమే తన పోరాటమని కవిత స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి విప్లవాత్మక మైన మార్పులు రావాలని.. అన్ని వర్గాలకు అధికారం అందాలని ఆకాంక్షించారు. బీసీలకు భిక్షం వేయొద్దని.. బిక్షం వేస్తే తీసుకోవడానికి వాళ్ళు బిచ్చగాళ్ళు కాదన్నారు. బీసీల పేరుతో కాంగ్రెస్ ఢీల్లీలో దొంగ దీక్షలు చేసిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి బీసీల ద్రోహిగా మిగిలిపోతారని.. నూటికి నూరు శాతం బీసీలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగబద్ధంగా బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు ముఖ్యమంత్రి కృషి చేయాలని డిమాండ్ చేశారు. జమలాపురం టెంపుల్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని... డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జమలాపురం ఆలయంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. పాతర్లపాడులో సామినేని రామారావు దారుణ హత్యకు ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. రామారావు హత్యపై డీజీపీని కలువనున్నట్లు కవిత తెలిపారు. హత్యా రాజకీయాలు సరికాదన్నారు. రేపు (బుధవారం) హైదరాబాద్‌లో సింగరేణి కార్మికుల సమస్యలపై సింగరేణి భవన్‌ను ముట్టడిరచబోతున్నామని ప్రకటించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి, కొత్తగూడెం, మహబూబాద్ జిల్లాలకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి ఆయకట్టు స్థిరీకరించి రైతాంగానికి సాగు నీరు అందించాలన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల భూమి వచ్చే వరకు వారి తరఫున పోరాడుతామని స్పష్టం చేవారు. తెలంగాణలో పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని.. సీసీఐతో మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేయాలని కవిత డిమాండ్ చేశారు.

# మోడీ దేశానికి బడే భాయ్..

మొదటిపేజీ తరువాయి

హోటల్ ఐటీసీ కోహినూర్‌లో నైరుతి రాష్ట్రాల పట్టణాభివృద్ధి మంత్రుల ప్రాంతీయ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు లభిస్తే హైదరాబాద్ అభివృద్ధి చెందుతుందని, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థలో మరింత కీలకమవుతుందని అన్నారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడంతో పాటు ఇక్కడ మరో కొత్త నగరాన్ని నిర్మించాలని చూస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. తెలంగాణ రైజింగ్ 2047 పేరుతో కొత్త ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలని, మిగతా సమయాల్లో పరస్పరం సహకారంతో అభివృద్ధిపై దృష్టి సారించాలని అన్నారు.

ప్రపంచంలోనే ఆర్థికంగా ఎదిగిన దేశంగా భారత్‌ను అభివృద్ధి చేసేందుకు మోదీ నేతృత్వంలోని కేంద్రం కృషి చేస్తోందని, ఈ క్రమంలో కేంద్రం నిర్దేశించుకున్న లక్ష్యాల్లో తెలంగాణ కూడా భాగమవుతుందని అన్నారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరిస్తే దేశాభివృద్ధి మరింత వేగవంతమవుతుందని అన్నారు. కేంద్రం 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీని నిర్దేశించుకుందని, అందులో



తెలంగాణ వాటా 10 శాతంగా ఉండాలని భావిస్తున్నట్లు చెప్పారు. జీడీపీలో ప్రధానంగా 5 మెట్రోపాలిటన్ నగరాలైన ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ దేశానికి ఎంతో కీలకంగా ఉన్నాయని అన్నారు. హైదరాబాద్ మెట్రో రైలు, ఆర్ఆర్ఆర్, మూసీ అభివృద్ధికి కేంద్రం సహకారం ఉండాలని కోరారు. మోదీ గుజరాత్ మోడల్ రూపొందించినట్లే తాము తెలంగాణ మోడల్ తీసుకువచ్చామని, కాబట్టి తన రాష్ట్రానికి ఇచ్చిన సహకారం తమకూ ఇవ్వాలని అన్నారు. మోదీ సబర్మతి ప్రక్షాళన చేసినట్లుగా తాము మూసీని చేస్తున్నామని అన్నారు.

# నీతీశ్‌లా బిహార్‌ను అర్థం చేసుకోలేకపోయా!

- **బీహార్ ఎన్నికల ఓటమికి పూర్తి బాధ్యత తనదేనన్న ప్రశాంత్ కిశోర్**
- **ప్రజల నమ్మకాన్ని గెలవడంలో విఫలమయ్యామని అంగీకారం**
- **ప్రాయశ్చిత్తంగా ఈ నెల 20న మౌన ఉపవాసం చేయనున్నట్లు ప్రకటన**

**బీహార్, నవంబర్ 18(ప్రజాస్వరం):**

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయానికి తానే పూర్తి బాధ్యత వహిస్తున్నట్లు జన్ సురాజ్ పార్టీ అధినేత, ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ ప్రకటించారు. ఫలితాల అనంతరం తొలిసారిగా మీడియాతో మాట్లాడిన ఆయన, తమ పార్టీ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోలేకపోయిందని అంగీకరించారు. ఈ వైఫల్యానికి ప్రాయశ్చిత్తంగా ఈ నెల 20న గాంధీ భీతిహర్వా ఆశ్రమంలో ఒకరోజు మౌన ఉపవాసం చేయనున్నట్లు తెలిపారు. "బీహార్ రాజకీయాల్లో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో కొత్త పాత్ర పోషించాం. కానీ ప్రజలు మమ్మల్ని తిరస్కరించారు. మా ఆలోచనల్లోనే ఎక్కడో లోపం ఉండి ఉంటుంది. వంద శాతం బాధ్యత నాదే. చాలా నిజాయతీగా ప్రయత్నించాం, కానీ విఫలమయ్యాం. ఈ నిజాన్ని అంగీకరించడానికి ఎలాంటి ఇబ్బంది లేదు" అని ప్రశాంత్ కిశోర్ అన్నారు. గత మూడేళ్లుగా తన శక్తినంతా ధారపోసి పనిచేసినా ఫలితం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, తాను వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని పీకే స్పష్టం చేశారు. బీహార్‌ను బాగు చేయాలనే తన సంకల్పం నెరవేరే వరకు పోరాటం కొనసాగిస్తానని తెలిపారు. "నేను తప్పులు చేసి ఉండొచ్చు, కానీ ఎలాంటి నేరం చేయలేదు. కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టలేదు. హిందూముస్లిం రాజకీయాలు చేయలేదు. డబ్బులిచ్చి ఓట్లు కొనే నేరానికి పాల్పడలేదు" అని వ్యాఖ్యానించారు. ఇటీవల జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేసిన ప్రశాంత్ కిశోర్ పార్టీ జన్ సురాజ్.. ఒక్క స్థానంలో కూడా గెలవలేకపోవడమే కాకుండా, అభ్యర్థులంతా డిపాజిట్లు కోల్పోవడం గమనార్హం.

# పంతాలకు పోయి.. ప్రాణాలు తీసుకోవద్దు..


- అర్బన్ నక్సలైట్లను నమ్మి మోసపోకండి
- అర్బన్ నక్సలైట్లు దేశద్రోహులంటూ ఫైర్
- ఏ పార్టీ అధికారంలో ఉన్నా అర్బన్ నక్సలైట్లు పైరవీలు చేసుకుంటారని ఆరోపణ
- అర్బన్ నక్సలైట్ల మాటలు నమ్మి అమాయక పేదలు తుపాకీ పట్టి అడవుల్లో తిరుగుతున్నారని విమర్శ
- మావోయిస్టులకు బండి సంజయ్ పిలుపు



**హైదరాబాద్, నవంబర్ 18(ప్రజాస్వరం):**
మావోయిస్టులు అర్బన్ నక్సలైట్లను నమ్మి మోసపోవద్దని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సూచించారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా అర్బన్ నక్సలైట్లు పైరవీలు చేసుకుంటూ ఆస్తులు పోగేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల పర్యటనకు వచ్చిన ఆయన వేములవాడ ఏరియా ఆసుపత్రికి రూ. 1.5 కోట్ల విలువైన వైద్య పరికరాలను అందజేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మావోయిస్టులు అర్బన్ నక్సలైట్ల మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. వారి మాటలు నమ్మి అమాయక పేదలు తుపాకీ పట్టి అడవుల్లో తిండి తిప్పలు లేక తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టుల చావుకు అర్బన్ నక్సలైట్లు కారణమని అన్నారు. అర్బన్ నక్సలైట్లు దేశద్రోహులని ఆయన మండిపడ్డారు. నక్సలైట్లు ఇప్పటికైనా తుపాకీని వీడి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవడానికి మరో నాలుగు నెలల గడువు మాత్రమే ఉందని అన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి మావోయిజాన్ని అంతం చేసి తీరుతామని ఆయన పేర్కొన్నారు.

# జంగిల్ రాజ్ పాలనకు పరాకాష్ట!

- ఫేక్ ఎన్‌కౌంటర్స్ చేయడం విచారకరం
- కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు జంగిల్ రాజ్ పాలనకు పరాకాష్ట
- పోలీసులు కూడా ఇందులో పావులుగా మారారు



**హైదరాబాద్, నవంబర్ 18(ప్రజాస్వరం):**
మావోయిస్టులను చంపుకుంటూ పోవడమంటే మానవ హననం తప్ప మరొకటి కాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు జంగిల్ రాజ్ పరిపాలనకు పరాకాష్ట అని పేర్కొన్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల పోలీసులు కూడా ఇందులో పావులుగా మారారని ఆయన మండిపడ్డారు. ఈ రోజు మారేడుమిల్లిలో జరిగిన హిడ్మా ఎన్‌కౌంటర్, అంతకుముందు మావోయిస్టులపై జరిగిన ఎన్‌కౌంటర్స్ మొత్తం ఫేక్ అని కూనంనేని అన్నారు. బూటకపు ఎన్ కౌంటర్స్‌తో మనుషులను చంపుకునే వ్యవస్థ ప్రపంచంలో ఎక్కడా లేదని కూనంనేని సాంబశివ రావు ఫైర్ అయ్యారు. మావోయిస్టులు ఏదైనా నేరాలు చేసివుంటే వారిని అరెస్టు చేసి, చట్టభద్దంగా విచారణ జరిపించాలే తప్ప ఇలాంటి ఫేక్ ఎన్‌కౌంటర్‌లు చేయడం విచారణకరమన్నారు. మావోయిస్టులపై జరుగుతున్న ఎన్‌కౌంటర్లపై విచారణ జరిపించాలని కూనంనేని సాంబశివ రావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# దుర్శేడ్ ప్రభుత్వ పాఠశాలలో మదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన



**కరీంనగర్(దుర్శేడ్), నవంబర్ 18 (ప్రజాస్వరం):**
మంగళవారం పై అధికారుల ఆదేశానుసారం ఏ. నిరంజన్ రెడ్డి, ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్, కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ అను కార్యక్రమమును దుర్శేడ్ గ్రామం లోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించి, విద్యార్థులకు మాదక ద్రవ్యాల పై అవగాహనా కల్పించి, వాటివల్ల జరుగు నష్టాలను కూడా తెలిపరిచడం జరిగింది. వారితో "నేను మాదక ద్రవ్యాల పై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని, నేను డ్రగ్స్ రహిత జీవన శైలిని అనుసరిస్తూ, నాతో పాటు ఏ ఒక్కరు డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి కృషి చేస్తానని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు మరియు అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తానని, నేను డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని ప్రతిజ్ఞ చేయుచున్నాను.జై హింద్" ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.ఇట్టి కార్యక్రమములో ఏ. నిరంజన్ రెడ్డి, ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్,కరీంనగర్ రూరల్ పి.యస్. తో పాటు, సయ్యద్ అంజద్,యస్. ఐ, ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు మరియు మూడు వందల మంది పిల్లలు పాల్గొనడం జరిగింది.



# సీజేఐ పై జరిగిన దాడిపై రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తాం

మొదటిపేజీ తరువాయి

అన్నారు. ఢిల్లీలోని ఏపీ భవన్ లో నిర్వహించిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడుతూ దళితుడైన సీజేఐ గవాయి మీద దాడి జరిగితే రాజ్యాంగంలో ఉన్న వ్యవస్థలు తమ విధి నిర్వహణలో వివక్షతను చూపెట్టాయని అన్నారు. ఎన్నో సంఘటనల మీద సుమోటో కేసులు తీసుకున్న రాజ్యాంగ వ్యవస్థలకు సుప్రీం కోర్ట్ చీఫ్ మీద జరిగిన దాడి కనిపించకపోవడం దారుణమని అన్నారు. కేవలం సీజేఐ దళితుడు కనుకనే మౌనం వహించి వివక్షతను చుపాయని అన్నారు. గవాయి స్థానంలో ఉన్నత కులాలకు చెందిన జడ్జీ ఉంటే ఇలాగే మౌనం వహించేవారా? అని ప్రశ్నించారు. చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా పై దాడి చేసిన నిందితుడి పట్ల చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో న్యాయ వ్యవస్త, పోలీసులు, మానవ హక్కుల కమిషన్ విఫలం అయ్యాయి. జార్ఖండ్ హైకోర్టులో జడ్జితో లాయర్ వాగ్వాదానికి దిగితే అతనిపై కోర్టు ధిక్కరణ కేసు పెట్టారు. కానీ ఇక్కడ ఏ చర్యలేదు అన్నారు. సీజేఐపై జరిగిన దాడిని ప్రపంచం చూసింది. చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా పై దాడి జరిగిన తర్వాత తెలుగు రాష్ట్రాలతో పాటు దక్షిణాది రాష్ట్రాల్లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేసాం. నేడు గల్లి నుంచి ఉద్యమాన్ని ఢిల్లీ దాకా తీసుకువచ్చామని అన్నారు. రాష్ట్రపతి అపాయింట్మెంట్ కోసం లేఖ రాస్తాం. త్వరలోనే రాష్ట్రపతిని కలిసి రాజ్యాంగ వ్యవస్థలు చూపిన వివక్షతను, చేసిన నిర్లక్ష్యాన్ని వారి దృష్టికి తీసుకెళ్తాం. రాజ్యాంగంలో ఉన్న వ్యవస్థలు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న వ్యవస్థలను సరిచేయాల్సిన బాధ్యత రాష్ట్రపతిదే. రాజ్యాంగంలో ఉన్న వ్యవస్థలు విఫలమవుతున్నప్పుడు రాజ్యాంగ పరిరక్షకురాలుగా వ్యవస్థలపై చర్యలు తీసుకోవడానికి అధికారం రాష్ట్రపతికే ఉంటుంది. చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా తో ప్రమాణస్వీకారం చేయించింది రాష్ట్రపతి గారే. వివక్షతను చూపుతున్న రాజ్యాంగ వ్యవస్థలను సరిచేసి దళితులకు న్యాయం చేయాలి. సీజేఐపై దాడి దేశంలో ఉన్న దళితులపై జరిగిన దాడిగా చూస్తున్నాం. న్యాయ వ్యవస్త స్వతంత్రతను కాపాడేందుకు, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు మా ఆందోళన కొనసాగుతుందని అన్నారు.



# హిడ్మా హతం

మొదటిపేజీ తరువాయి

అగ్రనేత హిడ్మా సైతం నేలకొరిగాడు. వచ్చే మార్చి లోగా నక్సల్స్‌ను అంతం చేస్తామన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటనకు అనుగుణంగా ఆపరేషన్ కగార్‌తో బలగాలు దూసుకుపోతున్నాయి. తాజాగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎదురుకాల్పులు జరిగాయి. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు మావోయిస్టుల మధ్య ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో మోస్ట్‌వాంటెడ్ మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు మద్వి హిడ్మా, ఆయన భార్య రాజే, అనుచరులు మల్లా, దేవే, చెల్లూరి నారాయణ అలియాస్ సురేశ్, టెక్ శంకర్ ఉన్నారు. హిడ్మాపై కోటి, ఆయన భార్యపై 50 లక్షల రివార్డు ఉన్నాయి. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి ఆ ప్రాంతంలో భద్రతా బలగాల కూంబింగ్ కొనసాగుతున్నట్లు ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తెలిపారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలపై సమాచారం నేపథ్యంలో కూంబింగ్ నిర్వహించినట్లు చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పూర్వాటి గ్రామంలో జన్మించిన మద్వి హిడ్మా.. బస్తర్ ప్రాంతంలో దళంలో కీలక సభ్యుడిగా ఎదిగారు. చిన్నవయసులోనే మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడయ్యారు. గెరిల్లా దాడుల వ్యూహకర్తగా పేరుపొందారు. పీపుల్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కమాండర్‌గా, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగానూ పనిచేశారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలోనూ ఎదురుకాల్పులు జరిగాయి. మంగళవారం ఉదయం ఎర్రబోరు ప్రాంతంలో మావోయిస్టులు భద్రతా బలగాల మధ్య జరిగిన కాల్పుల్లో ఓ మావోయిస్టు మృతిచెందాడు. ఆ ప్రాంతంలో ఎదురుకాల్పులు కొనసాగుతున్నట్లు జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. ఈ క్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో అగ్రనేత మద్వి హిడ్మా మృతి చెందారు. హిడ్మాతో పాటు ఆయన భార్య, అనుచరులతో కలిపి మొత్తం ఆరుగురు ఈ ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయారు. హిడ్మా ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పర్వతి గ్రామానికి చెందిన స్థానిక మూరియా తెగకు చెందిన వ్యక్తి. 1981వ సంవత్సరంలో జన్మించిన హిడ్మా 10వ తరగతి వరకు మాత్రమే చదువుకున్నాడు. 2000 ప్రారంభంలో మావోయిస్ట్ ఉద్యమంలో చేరి, క్రమంగా అగ్రస్థానానికి ఎదిగాడు. ప్రస్తుతం సీపీఐ (మావోయిస్ట్), పీఎల్‌జీఏ బెటాలియన్ 1 కమాండర్‌గా దండకారణ్య ప్రాంతంలో (ఛత్తీస్‌గఢ్, బీజాపూర్, దంతేవాడ ప్రాంతాలు) పనిచేస్తున్నాడు. 2010లో జరిగిన దంతేవాడ దాడి (76 సీర్పీఎఫ్ సిబ్బంది హతం), 2013 జీరామ్ ఘాటి నరమేధం వంటి పలు పెద్ద దాడుల్లో ప్రధాన సూత్రధారి హిడ్మా అని ఆరోపణలు ఉన్నాయి. ఏడాది హిడ్మా సీపీఐ (మావోయిస్ట్) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సెక్రటరీగా పదోన్నతి పొందినట్లు పోలీసుల వద్ద సమాచారం ఉంది. హిడ్మాను పట్టుకోవడం కోసం పోలీసులు ఎంతగానో ప్రయత్నిస్తున్నారు. అతడి ఆచూకీ తెలిపిన వారికి బహుమతులు కూడా ప్రకటించారు. అడవుల భౌగోళిక పరిజ్ఞానం, గెరిల్లా యుద్ధ వ్యూహాలు, స్థానిక నెట్‌వర్క్‌లను ఉపయోగించడంలో హిడ్మా సిద్ధహస్తుడు. దీంతో అతడిని భద్రతా దళాలు చాలా కాలం పట్టుకోలేకపోయాయి 2004నుంచి ఇప్పటివరకు అతను 20కి పైగా ప్రధాన దాడుల్లో పాల్గొన్నట్లు భద్రతా సంస్థలు అంచనా వేస్తున్నాయి. వేలాది మంది సిబ్బందితో పెద్ద ఎత్తున చేపట్టిన ఆపరేషన్లు కూడా హిడ్మాను పట్టుకోలేకపోయాయి. ఎట్టకేలకు మారేడుమిల్లి అటవీ ప్రాంతాల్లో హిడ్మా, అతడి అనుచరులు షెల్టర్ తీసుకున్నారనే విశ్వసనీయ సమాచారం పోలీసులకు చిక్కింది. భద్రతా బలగాలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో హిడ్మాతో సహా ఆరుగురు మరణించినట్టు పోలీసులు తెలిపారు.




# ఐబొమ్మ రవి కేసులో ఈడీ రంగప్రవేశం...

మొదటిపేజీ తరువాయి

సమాయత్తమవుతోంది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు, ఎఫ్ఐఆర్, దర్యాప్తు నివేదికలను తమకు అందించాలని కోరుతూ ఈడీ అధికారులు హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు లేఖ రాశారు. పోలీసుల నుంచి వివరాలు అందిన వెంటనే ఈడీ అధికారులు తమ విచారణను అధికారికంగా ప్రారంభించనున్నారు.
ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవికి బెట్టింగ్ యాప్‌ల ప్రకటనల ద్వారా భారీగా నిధులు అందినట్లు గతంలో పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. అంతేకాకుండా, ఓ క్రిప్టో వాలెట్ నుంచి రవికి చెందిన ఎన్నారై ఖాతాకు ప్రతి నెలా రూ.15 లక్షలు బదిలీ అయినట్లు కూడా గుర్తించారు. ఈ నేపథ్యంలోనే విదేశీ నిధుల ప్రవాహం, హవాలా లావాదేవీలపై ఈడీ దృష్టి సారించింది. ఇప్పటికే పోలీసులు నిందితుడు రవికి చెందిన బ్యాంకు ఖాతాల్లోని సుమారు రూ.3.5 కోట్లను ఫ్రీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈడీ ఎంట్రీతో నిందితుడి బ్యాంకు ఖాతాల నిర్వహణ, నిధుల మళ్లింపుపై పూర్తి స్థాయిలో విచారణ జరగనుంది.

# ఐబొమ్మ రవి కేసులో భావోద్వేగం..

- తక్కువ శిక్ష పడేలా చూడాలంటూ తండ్రి కన్నీటి విజ్ఞప్తి
- తన కొడుకు చేసింది తప్పేనన్న ఐబొమ్మ రవి తండ్రి అప్పారావు
- మనవరాలి భవిష్యత్తు గురించే నా ఆందోళన అని వెల్లడి
- రవికి తక్కువ శిక్ష పడేలా చూడాలని అధికారులకు విజ్ఞప్తి




**హైదరాబాద్, నవంబర్ 18(ప్రజాస్వరం):**
ఐబొమ్మ పైరసీ కేసులో అరెస్ట్ అయిన ఇమ్మడి రవి తండ్రి అప్పారావు స్పందించారు. తన కుమారుడు తప్పు చేశాడని అంగీకరిస్తూనే, తన మనవరాలి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అతనికి తక్కువ శిక్ష పడేలా చూడాలని ఆయన అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. అప్పారావు మాట్లాడుతూ, "నా కొడుకు చేసింది తప్పే కావచ్చు. కానీ వాడికి ఒక కూతురు ఉంది. నా మీద దయతలిచి వాడిని స్టేషన్‌లో ఎక్కువగా ఇబ్బంది పెట్టొద్దని కోరుకుంటున్నాను. ఇప్పుడు నా బాధ అంతా నా మనవరాలి గురించే. ఆమె చాలా తెలివైనది. ఆమెను తలచుకుంటేనే గుండె తరుక్కుపోతోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తన కోడలు కూడా తనతో మాట్లాడటం లేదని ఆయన వాపోయారు. చట్టం ముందు అందరూ సమానమేనని, తన కొడుకును వదిలిపెట్టరని తనకు తెలుసని అప్పారావు అన్నారు. "చట్టానికి జాలి, దయ వంటివి ఉండవు. తప్పు చేసిన వాళ్లంతా ఒక్కటే. నా మనవరాలి కోసం కొడుకును వదిలేయరని తెలుసు. ఇప్పుడు నేను బాధపడటం తప్ప చేయగలిగింది ఏమీ లేదు" అని ఆయన నిస్సహాయత వ్యక్తం చేశారు. ఐబొమ్మ వెబ్‌సైట్ ద్వారా కొత్త సినిమాలను పైరసీ చేస్తూ కోట్లు సంపాదించాడన్న ఆరోపణలతో రవి అరెస్ట్ అయిన సంగతి తెలిసిందే. ఈ కేసులో విచారణ కొనసాగుతుండగా, అతని తండ్రి చేసిన ఈ భావోద్వేగపూరిత విజ్ఞప్తి అందరినీ కదిలిస్తోంది.

# డ్రగ్స్ మూలాలు పెకిలించివేయాలి

- నిరంతరం విస్తృత తనిఖీలు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్,నవంబర్ 18 (ప్రజాస్వరం):**
యువత, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాల మూలాలను పెకిలించివేయాలని, డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చి దిద్దాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో పోలీస్, ఎక్సైజ్, వైద్య ఆరోగ్య, శిశు సంక్షేమ, విద్య తదితర శాఖల అధికారులతో జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాతుతూ మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై బహిరంగ ప్రదేశాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్, ఎక్సైజ్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో విస్తృత తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.వైద్యులు రాసిన చీటీ లేకుండా మత్తు మందులను, ఇంజక్షన్లను మెడికల్ షాపుల్లో విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మెడికల్ దుకాణాలలో తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో స్నేహిత కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో విస్తృత అవగాహన కొనసాగించాలని అన్నారు. అవగాహన కార్యక్రమాల్లో పోలీసులను భాగస్వాములను చేయాలని తెలిపారు.






కరీంనగర్ సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ.. మత్తు పదార్థాల నిర్మూలనకు నిత్యం గస్తీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు హాస్టళ్ళు, ఆర్టీసీ కార్గో, ప్రైవేట్ పార్సిల్ సంస్థలతోపాటు ఆన్లైన్ సంస్థలకు సంబంధించి గోదాములను తనిఖీ చేస్తున్నట్లు వివరించారు. డ్రగ్ డిటెక్షన్ కిట్లు, పోలీస్ డాగ్ సేవలను వినియోగిస్తున్నామని అన్నారు. నాఖాబంధి చేపట్టి విస్తృత తనిఖీలు చేస్తున్నామని వెల్లడించారు. మాదక ద్రవ్యాలు వినియోగం, సరఫరా వంటి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే,పోలీస్, ఎక్సైజ్,విద్య,వైద్య,మహిళా శిశు సంక్షేమం,తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సంగమేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం ఉత్సవాలు



**మాసాయిపేట, నవంబర్ 18(ప్రజాస్వరం) :**
మండల కేంద్రంలోని శ్రీ భవాని సంగమేశ్వర స్వామి దేవాలయంలో కార్తీకమాసం ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్తీక మాసం చివరి సోమవారం పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో గణపతి హోమం, శివుడికి రుద్రాభిషేకం, కుంకుమార్చన, గోమాత పూజ, నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో అష్ట సహస్ర దీపోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం




- **సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. ఎం విజయ్ కుమార్**

**దౌల్తాబాద్, నవంబర్ 18( ప్రజా స్వరం) :**
ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వజ్రాయుధం, ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. ఎం విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కవి, గాయకులు జొన్నోజి నాగులు రచించిన ' ఓట్ల పండుగ 'ఓటర్ చైతన్య గీతాన్ని కమిషనర్ విజయ్ కుమార్ చేతుల మీదుగా విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం 18 సంవత్సరాలు నిండిన వయోజనులందరికీ డా. బి. ఆర్. అంబేద్కర్ ఓటు హక్కును కల్పించాడాని, ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో స్వచ్ఛందంగా వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వజ్రాయుధం, ఓటు హక్కు ద్వారానే ప్రజలను పరిపాలించే నాయకులను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు ద్వారా ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవడంలో ఓటు యొక్క ప్రాధాన్యత చాలా గొప్పదని,ఓటు హక్కును ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా మీకు నచ్చిన వ్యక్తికి ఓటు వేసే ప్రశాంతమైన వాతావరణం కల్పిస్తామని తెలిపారు. ఓటర్లను చైతన్యం చేసే విధంగా, సరైన నాయకులను ఎన్నుకునే విధంగా అవగాహన కల్పించాలని తన వంతు సామాజిక బాధ్యతతో పాటను రాసి ప్రజలలోకి తీసుకువెళ్తున్న కవి, గాయకులు జొన్నోజి నాగులను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో ఓట్ల పండుగ పాట రచయిత జన్నోజి నాగులు,జర్నలిస్టు పుట్ట రాజు తదితరులు పాల్గొన్నారు.



# డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- **మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్**

**మేడ్చల్, (ప్రజా స్వరం) :**
డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ అన్నారు. కేంద్ర రాష్ట్రల ఆదేశాల మేరకు మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కార్యాలయం ముందు నిర్వహించారు. కమిషనర్ వెంకట గోపాల్ పాల్గొని మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకట గోపాల్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల కలిగే హానిని వివరించారు. మాదకద్రవ్యాల ను సేవించడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. మాదకద్రవ్యాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని సూచించారు. మాదకద్రవ్యాల వల్ల తమ కుటుంబ వాలే కాకుండా సమాజానికి సైతం నష్టం జరిగే అవకాశం ఉందని తెలిపారు. డ్రగ్స్ రైతు సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్లు జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# బస్సు జాతాను జయప్రదం చేయండి



- **సీపీఐ మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటపల్లి శంకర్**

**జవహర్‌నగర్, నవంబర్ 18, ప్రజాస్వరం :**
సిపిఐ పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాలు నిండిన సందర్భంగా గిరి ప్రసాద్ నగర్ సిపిఐ శాఖ కార్యదర్శి కొండ సత్యం సాగర్ ఆధ్వర్యంలో గిరి ప్రసాద్ నగర్ సిపిఐ ఆఫీసులో కరపత్రం విడుదల చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమానికి ఇట్టి కార్యక్రమానికి తోటపల్లి శంకర్ హాజరై మాట్లాడుతూ.. భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు డిసెంబర్ 20వ తేదీతో పూర్తి చేసుకుంటున్న సందర్భంలో పార్టీ ఆవిర్భవించిన నాటి నుండి కార్మికుల చట్టాల కోసం కార్మికుల హక్కుల కోసం కనీస వేతనాల కోసం రైతులకు గిట్టుబాటు ధర కోసం ఉపాధి హామీ చట్టం కోసం సమాచార హక్కు చట్టం కోసం అటవీ హక్కుల చట్టం కోసం సబ్బండ వర్గాలకు అవసరమైన అనేక చట్టాలను సాధించడం కోసం జరిగిన పోరాటాలు చేసి న పార్టీ సిపిఐ పార్టీ అన్నారు. ఇప్పటికే ఎన్నో పార్టీలు పుట్టి కనుమరుగైన సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాలు సుదీర్ఘంగా పోరాటాలు నిర్వహిస్తూ ఇంకా నిలబడి ఉండటానికి ప్రధాన కారణం కార్మిక వర్గం బడుగు బలహీన వర్గాల సహకారమే అన్నారు అందులో భాగంగా ఈనెల 20వ తేదీన జవహర్ నగర్ కార్పొరేషన్కు సిపిఐ పార్టీ బస్సుజాత ప్రవేశిస్తున్నందున ఆ జాతకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ గారు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రి డి జి నరేంద్ర ప్రసాద్ తెలంగాణ రైతు సంఘం కోశాధికారి రాష్ట్ర కళాకారులు హాజరవుతున్నందున సబ్బండ వర్గాల ప్రజలు జవహర్ నగర్ అంబేద్కర్ విగ్రహం వద్దకు ఉదయం 12 గంటలకు చేరుకొని జాత కార్యక్రమాలు జయపురం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పాల్గొన్నవారు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నరసింహులు గిరిజన సమైక్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్యామల, లత, వి స్వరూప నాయక్ మహిళా సమైక్య కాపుర మండల అధ్యక్షురాలు జయమ్మ, సిపిఐ మండల నాయకులు కురుమయ్య, సాగర్, నరసింహ, మూడవ రాజు నాయక్. సూర్యం, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

# చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

**దౌల్తాబాద్, (ప్రజాస్వరం) :**
చేపల వేటకు వెళ్లి ప్రమాదవశత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన రాయపోల్ మండలం లింగారెడ్డి పల్లిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం. గజ్వేల్ పట్టణానికి చెందిన మోతె సాయిలు (45) కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం చేపలు వేటకు వెళ్తానని చెప్పి ఇంట్లో నుండి బయలుదేరాడు. సాయిలుతోపాటు వారికి తెలిసిన మరో యువకుడు బదనాపురం కార్తీక్ ఇద్దరు కలిసి వెళ్లారు.లింగారెడ్డి పల్లి గ్రామంలోని చెరువులోకి వెళ్లారు. చెరువులో దిగి చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడి సాయిలు చెరువులో మునిగిపోయాడు. సాయిలు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతుకుతున్నారు. సాయిలుతో పాటు వెళ్లిన కార్తీక్తు భయంతో వారి ఇంటికి వచ్చి సమాచారం తెలిపాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చెరువు వద్దకు వెళ్లి సాయిలు ఆచూకీ కోసం వెతకగా సోమవారం సాయంత్రం సాయిలు మృతదేహం లభ్యమయింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కుంచం మానస తెలిపారు.

# రైతుల సంక్షేమానికి చర్యలు





- **నాణ్యమైన విత్తనాలు, ఎరువుల విక్రయానికే అనుమతి**
- **జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపరాణి**

**దౌల్తాబాద్, నవంబర్ 18 (ప్రజాస్వరం)**
రైతులకు నాసిరకం లేదా కాలం చెల్లిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయం జరగకుండా ఫర్టిలైజర్ దుకాణ యజమానులు తప్పనిసరిగా నాణ్యమైన వ్యవసాయ ఇన్పుట్స్ మాత్రమే అందించాలంటూ సిద్దిపేట జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపరాణి స్పష్టం చేశారు. మంగళవారం రాయపోల్ మండలం చిన్నమాసాన్‌పల్లి రైతు వేదికలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల భవిష్యత్తు నాణ్యమైన విత్తనాలు, ఎరువులపై ఆధారపడి ఉండేందున డీలర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ నాసిరకం లేదా గడువు ముగిసిన వస్తువులను విక్రయించరాదని హెచ్చరించారు. అలాంటి అక్రమ విక్రయాలు గుర్తించినట్లయితే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

**రైతుల ప్రయోజనం దృష్ట్యా ఆమె చేసిన ముఖ్య సూచనలు :**

* రైతులు కొనుగోలు చేసే ప్రతి విత్తనం, ఎరువు, పురుగుమందుకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలి
* విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను ఎమ్మార్పీ ధరలకు మాత్రమే విక్రయించాలి
* అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు
* ప్రతి దుకాణంలో స్టాక్ రిజిస్టర్ సక్రమంగా నిర్వహించాలి
* కాలం చెల్లిన సరకులు విక్రయిస్తే డీలర్‌పై కఠిన చర్యలు తీసుకోబడతాయి
* రైతులు ఏ వస్తువు కొనుగోలు చేసినా తేదీ, బ్యాచ్ నంబర్, గడువు తేదీ తప్పనిసరిగా చెక్ చేయాలి

స్వరూపరాణి రైతులకు సూచిస్తూ.. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు మాత్రమే కొనుగోలు చేయాలని, రసీదు తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో కలిగే సమస్యలను నివారించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్. నరేష్, ఏఈవోలు ప్రవీణ్, ప్రియాంక, ఫర్టిలైజర్ డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనపై చైతన్య ప్రతిజ్ఞ

**ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీమధు శ్రీవత్సవ**

**డ్రగ్స్ వాడకంతో ఆరోగ్యంపై ప్రభావం**

1. మెదడు పనితీరు దెబ్బతినడం,
2. పఠన సామర్థ్యం తగ్గడం,
3. ఆసక్తి కోల్పోవడం,
4. కుటుంబానికి మానసిక, ఆర్థిక ఇబ్బందులు కలగడం,
5.అపరాధాల వైపు నెడుతుండడం, మరణానికీ దారితీయడం వంటి భయంకరమైన పరిణామాలు ఏర్పడుతాయని విద్యార్థులు తప్పక తెలుసుకోవాలి.
6. యువత దేశ భవిష్యత్ కాబట్టి డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండి, సమాజంలో కూడా ఇతరులకు అవగాహన కల్పించే బాధ్యత ప్రతి ఒక్కరిది.
7. విద్యార్థులు మాత్రమే కాదు, తల్లిదండ్రులు కూడా పిల్లల జీవితంపై కళ్ళు పెట్టి మంచిపద్ధతులకు ప్రోత్సహించి, మాదకద్రవ్యాలపై చైతన్యం కలిగించాల్సిన అవసరం ఉన్నదని ప్రిన్సిపల్ సూచించారు.



**దౌల్తాబాద్, నవంబర్ 18 (ప్రజా స్వరం)**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతిజ్ఞ కార్యక్రమంను ప్రభుత్వం జూనియర్ కళాశాల దౌల్తాబాద్‌లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు చురుకుగా పాల్గొని డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపల్ శ్రీ మధు శ్రీవాత్సవ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడకం యువత భవిష్యత్‌కి తీవ్రమైన ముప్పుగా మారిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం. మంతా నాయక్, అధ్యాపకులు ఎం. సంపత్ కుమార్, జే. సుధాకర్, ఎం. లక్ష్మీనారాయణ, డి. రాజు, ఎస్. దయానంద్, ఈ. శ్రీనివాస్ రెడ్డి, కే. శ్రీనివాస్, జె. భాగ్యమ్మ, బి. రమ్య, డి. పవన్ కుమార్, జి. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనాలే వాడండి



• దుబ్బాక డివిజన్ ఏడీఏ మల్లయ్య

**దౌల్తాబాద్, నవంబర్18(ప్రజాస్వరం) :**

యాసంగి సీజన్ ప్రారంభం కావడంతో మండలవ్యాప్తంగా రైతులు పంట సాగు పనుల్లో నిమగ్నమవుతున్నారు. ఈ సందర్భంగా రైతులకు నష్టం జరగకుండా ముందస్తు చర్యగా దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ఫెర్టిలైజర్ మరియు విత్తన దుకాణాలను దుబ్బాక వ్యవసాయ శాఖ డివిజన్ ఏడిఏ కె. మల్లయ్య అకస్మాత్తుగా తనిఖీ చేశారు. వివిధ దుకాణాల్లో నిల్వలో ఉన్న విత్తనాల నాణ్యత, బ్యాచ్ నంబర్లు, గడువు తేదీలు, లైసెన్స్ వివరాలు, నిల్వ పరిస్థితులను ఆయన సమగ్రంగా పరిశీలించారు. తరువాత స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆయన మాట్లాడుతూ, యాసంగి సాగు చేసే అన్నదాతలు నాణ్యతకు ప్రాముఖ్యత ఇవ్వాలని, ప్రభుత్వం ఆమోదించిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. నాసిరకం లేదా గడువు ముగిసిన విత్తనాలు వాడినట్లయితే పంట దిగుబడిలో భారీ నష్టం, ఆర్థిక నష్టాలు తప్పవని ఆయన హెచ్చరించారు. దీనిని నివారించేందుకు వ్యవసాయ శాఖ తరఫున దుకాణాలపై తరచూ తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు.

అలాగే మల్లయ్య మాట్లాడుతూ “రైతులు తమ భూముల పరిస్థితి, నీటి అందుబాటు, వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పంటలను ఎంపిక చేసుకోవాలి. నీటిపారుదల సౌకర్యం పుష్కలంగా ఉన్న ప్రాంతాల్లో ఎక్కువ నీరు అవసరమైన పంటలను, నీటి వనరులు పరిమితంగా ఉన్న చోట నీరు తక్కువగా అవసరమయ్యే పంటలను ఎంచుకోవాలి. క్షేత్రస్థాయి వ్యవసాయ అధికారులు ఎల్లప్పుడూ రైతులకు మార్గదర్శకత్వం అందించడానికి సిద్ధంగా ఉంటారు, వారి సలహాలను తప్పక తీసుకోవాలి” అని సూచించారు. తనిఖీల సమయంలో సాధారణంగా దుకాణదారులు అమ్మే ఎరువులు, పురుగుమందులు కూడా పరిశీలించి, రైతులకు మాన్యువల్స్, రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలని దుకాణ యజమానులకు ఆదేశించారు. రైతులు కూడా విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో బిల్లులు తీసుకోవడం ద్వారా ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు ప్రభుత్వ పరిహారం లేదా చర్యలు పొందడం సులభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దొమ్మాట వ్యవసాయ విస్తరణ అధికారి సంతోష్ కుమార్ పాల్గొని, రైతులకు అవగాహన కార్యక్రమాలు కూడా చేపడుతున్నామని పేర్కొన్నారు.



# అభివృద్ధి పనులకు మంత్రి వివేక్ శంకుస్థాపన





**గజ్వేల్, నవంబర్ 18 ప్రజా స్వరం :**

కేటీఆర్ అత్యుత్సాహంతో కారు సారు సర్కారు అని గొప్పలకు పోయిన కెటిఆర్ మాటలకు ఇక చెల్లవు అని జూబ్లీ హిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం గట్టి బిఆర్ఎస్ కు గట్టి గుణపాఠం చెప్పారని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్లో మంత్రి వివేక్ వెంకట స్వామి పర్యటించారు.వారితో పాటు మాజీ ఎమ్మెల్యే సిద్దిపేట డిసిసి అధ్యక్షుడు నర్సారెడ్డి, ఏఎంసి చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి తో కలిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సమీకృత మార్కెట్ యార్డులో సుమారు నాలుగన్నర కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో ప్రజాపాలన ఉండాలన్నదే సీఎం లక్ష్యం అని తెలిపారు. రాష్ట్ర మొత్తంలో సుమారు 5 లక్షల రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని చెప్పారు. సన్న బియ్యం కార్యక్రమం ఏ రాష్ట్రంలో లేదని తెలంగాణ లోనే ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నామన్నారు. అనంతరం తన్జీముల్ మజీద్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లను అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మైనారిటీలకు పెద్దపీట వేస్తుందని తెలిపారు.మైనారిటీల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉదన్నారు వెంకటస్వామి. తెలంగాణలోని మైనారిటీల అభ్యున్నతికి సర్కార్ కృషి చేస్తుందని ఆయన అన్నారు. మల్లన్నసాగర్ నిర్వాసితుల స్మశాన వాటిక కొరకు మాకు వినతి పత్రం అందింది. త్వరలోనే వారి సమస్యను పరిష్కరిస్తాం అని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



• దుబ్బాక ఏడీఏ మల్లయ్య

**దౌల్తాబాద్ నవంబర్ 18 ప్రజా స్వరం:**

రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్మి మద్దతు ధర పొందాలని దుబ్బాక ఏడీఏ కే. మల్లయ్య సూచించారు. మండల పరిధిలోని ఇంద్రప్రియల్ ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు మద్దతు ధర అందించడానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకుని మద్దతు ధరను పొందాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు పాటించి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. రైతులకు కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు అందుబాటులో ఉంచడంతో పాటు, వర్షాల కారణంగా ఇబ్బందులు తలెత్తకుండా తార్పాలిన్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. రైతులు ఐకేపీ అధికారులకు సహకరించి తమ తమ ధాన్యాన్ని కొనుగోలు ప్రక్రియజరిగే విధంగా సజావుగా జరిగే విధంగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అధిక వడ్డీ వసూలు చేస్తున్న వ్యాపారి అరెస్ట్

**దుబ్బాక , నవంబర్ 18 (ప్రజాస్వరం) :**

అధిక వడ్డీకి అప్పులు ఇస్తూ, పలువురిని ఇబ్బందులకు గురి చేస్తున్న వడ్డీ వ్యాపారిని అదుపులోకి తీసుకున్న ఘటన దుబ్బాక మండలం గంభీర్పూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్సై కీర్తి రాజు తెలిపిన వివరాల ప్రకారం... గంభీర్పూర్ గ్రామంలో చింతు గణేష్ అనే వడ్డీ వ్యాపారి బంగారము, వ్యవసాయ పత్రాలు, వాహన పత్రాలు కుదువ పెట్టుకుని, అధిక వడ్డీకి అప్పులు ఇస్తూ, పలువురిని ఇబ్బందుల గురి చేస్తున్నాడని విశ్వసనీయ సమాచారం మేరకు దుబ్బాక పోలీసులు సోమవారం అతని



ఇంటిపై దాడి చేసి, అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి నాలుగు కార్లు, ఒక ట్రాక్టర్, ఏడు ద్విచక్ర వాహనాలు, ప్రామిసరీ నోట్లు, వ్యవసాయ భూముల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. సుమోటోగా ఫిర్యాదు తీసుకుని, వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు..

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**గజ్వేల్/ ములుగు నవంబర్ 18 ప్రజాస్వరం :**

మండల కేంద్రంమైన ములుగులో గ్రామానికి చెందిన ఎర్రన్న నరసయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి వారికి 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు వారితో పాటు మాజీ వార్డు సభ్యులు నాగేష్ ముదిరాజ్ మరియు తలారి నర్సింలు, దర్శనం రమేష్, తిగుళ్ల నర్సింలు, ఎర్రన్న కృష్ణ, రవి, తోడేటి నరేందర్ తదితరులు ఉన్నారు

# సత్యనారాయణ వ్రతాలు

**దౌల్తాబాద్, నవంబర్ 18(ప్రజాస్వరం) :**

మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లో మంగళవారం స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో సామూహిక సత్యనారాయణ వ్రతాలను భక్తిపూర్వకంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని వాకులు చెబుతూ స్వామివారిని దర్శించుకున్నారు. వ్రతాల అనంతరం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమంను సదస్సుగా నిర్వహించారు. కార్యక్రమం విజయవంతంగా జరిగేందుకు శ్రమించిన సేవాదారులకు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.





# బార్‌కు పక్కనే స్కూల్?

## అనుమతులు రద్దు చేయాలని కాలనీవాసుల విన్నపం

**కాప్రా,నవంబర్ 18(ప్రజాస్వరం):**

కాప్రా మున్సిపల్ పరిధిలోని నేతాజీ నగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన గౌతమ్ మోడల్ స్కూల్ అనుమతులను రద్దు చేయాలని కోరుతూ కాలనీవాసులు మంగళవారం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. నూతనంగా స్కూల్ ఏర్పాటు చేయడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని కాలనీవాసులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో విషయం తెలుసుకున్న మానవ హక్కుల కమిషన్ సీనియర్ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ ఇలాక్యా కరుణాకరన్ (ఐపీఎస్) మేడ్చల్ జిల్లా విద్యాశాఖాధికారి ఐ. విజయ కుమారి, ట్రాఫిక్ ఏసిపి ఎంవీ శ్రీనివాసరావు, కుషాయిగూడ ఎసిపి వెంకట్ రెడ్డి , ట్రాఫిక్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ ఎన్ఆర్ఎల్ రాజు, కుషాయిగూడ సిఐ ఎల్ భాస్కర్ రెడ్డి, కాప్రా తహసిల్దార్ బైరెడ్డి రాజేష్, కాప్రా టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ తుల్జాసింగ్, కాప్రా మండల విద్యాధికారి దూసరి నరసింహ గౌడ్, కుషాయిగూడ సబ్ ఇన్ స్పెక్టర్ నిమ్మల వెంకన్న తదితరులు మంగళవారం పాఠశాలను సందర్శించారు. కాలనీ వాసులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే గౌతమ్ మోడల్ స్కూల్ అనే కొత్త పాఠశాలను ఇరుకైన కాలనీలో ప్రారంభించారని ఆవేదన వ్యక్తం చేశారు. బార్‌కు అతి సమీపంలో పాఠశాల ఏర్పాటు చేశారని, పాఠశాలను ఏర్పాటు చేయడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. కాలనీ రహదారులు చాలా ఇరుకుగా, రద్దీగా ఉండటంతో పీక్ అవర్స్‌లో వాహనాలు నడపడం కష్టమవుతుందన్నారు. స్కూల్ యజమాన్యం రోడ్లకు అడ్డంగా భారీకేట్లు పెట్టి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ పరిస్థితుల్లో కొత్త పాఠశాల ఏర్పాటు చేయడం వల్ల కాలనీలో మరింత సమస్యలకు దారితీసే అవకాశం ఉందన్నారు. భవిష్యత్ సమస్యలను ముందుగానే అంచనా వేసి ఇప్పటికే డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కు, జిల్లా విద్యాశాఖ అధికారికి అనుమతులను రద్దు చేయాలని కోరుతూ వినతి పత్రాలు సమర్పించినట్లు తెలిపారు. స్కూల్ అనుమతులు తక్షణమే రద్దు చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు స్పష్టం చేశారు.



# బూత్, వార్డు కమిటీల ఏర్పాటుపై వాసుపల్లి ఆదేశాలు..

- **కష్టపడే వారికి ప్రాధాన్యత కల్పించండి..**
- **దక్షిణ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్**

**విశాఖపట్నం,నవంబర్ 18(ప్రజాస్వరం):**

వైయస్సార్సీపి అధిష్టానం ఆదేశాల మేరకు వార్డు అనుబంధ, బూత్ కమిటీలు ప్రతిష్టాత్మకంగా త్వరితగతిన పూర్తి చేయాలని దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ వార్డు అధ్యక్షులకు ఆదేశించారు. 39, 38,35 వార్డులలో పర్యటించి ఆయా వార్డు అధ్యక్షులతో సమావేశం అయ్యారు. 35 వ వార్డు అధ్యక్షుడు కనక రెడ్డి పూర్తిచేసిన ఆయా కమిటీ వివరాలను వాసుపల్లి గణేష్ కుమార్ కు ముందుగానే అందజేశారు. అనంతరం 39 వ వార్డు ముజుబ్ ఖాన్, 38వ వార్డు గురజాపు రవితో వారి కార్యాలయాల వద్ద కలిసి సమావేశమయ్యారు. అధిష్టానం సీరియస్ ఆదేశాలు జారీ చేసిందని, కష్టపడే వారికి కమిటీలో చోటు కల్పించి పూర్తి చేసిన నివేదికను త్వరితగతిన అందజేయాలని వాసుపల్లి గణేష్ కుమార్ ఆదేశించారు. వైయస్సార్సీపి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు సంస్థాగతంగా మరింత బలపడాలని, బూతు, వార్డు, అనుబంధ సంఘాల కమిటీల్లో మంచి కార్యకర్తలకు చోటు కల్పించాలని వెల్లడించారు ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి జిల్లా సెక్రెటరీ అబ్బిరెడ్డి ఆదివిష్ణు,జిల్లా బీసీ సెల్ ప్రెసిడెంట్ సనపల రవీంద్ర భారత్,సౌత్ నాయకులు,జిల్లా నాయకులు,వార్డ్ నాయకులు, వార్డ్ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు





# ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన ఎంపీడీవో

- **జి జలంధర్ రెడ్డి**

**వలిగొండ,నవంబర్ 18(ప్రజాస్వరం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ఆరూరు గ్రామాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలందర్ రెడ్డి సందర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రమే ష్, పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణ పనులను పరిశీలించిన ఈ సందర్భంగా లబ్ధిదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న సమస్యలు మరియు సవాళ్లను తెలుసుకున్నారు. నిర్మాణ పనులను అత్యంత ప్రాధాన్యంతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. అలాగే నిర్మాణ పురోగతిపై తాజా నివేదికలను త్వరితగతిన సమర్పించాలని సూచించారు. ఇసుక కు సంబంధించి, లబ్ధిదారులు ఎక్కువ ధర ఇచ్చి విక్రయించుకోకూడదు అని తెలిపారు అలాగే, ట్రాక్టర్ యజమానులతో మాట్లాడుతూ ఎక్కువ ధర చెల్లించమని లబ్ధిదారులను ఇబ్బంది పెడితే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# వలిగొండ మండలంలో ఉపాధ్యాయుల ఏకగ్రీవ ఎన్నిక

**వలిగొండ,నవంబర్ 18(ప్రజాస్వరం):**

వలిగొండ మండల శాఖ భువనగిరి జిల్లా వలిగొండ మండల తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (TPUS) అధ్యక్షులుగా ఎర్ర వెంకట నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి లు ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. ఈ ఎన్నిక పర్యవేక్షకులుగా మాజీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు బందారపు లింగస్వామి హాజరై ఎన్నిక నిర్వహించడం జరిగింది. అనంతరం లింగస్వామి మాట్లాడుతూ ఉపాధ్యాయులు దేశభక్తి సంస్కృతి సాంప్రదాయా సాంప్రదాయాలు పరిరక్షించడం కోసం పరితపించాలని ఈ సందర్భంగా పిలుపునివ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావలసిన పెండింగ్ డిఏలు మరియు పిఆర్సి ని వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు పొట్లపల్లి స్వామి,జిల్లా ఉపాధ్యక్షులు ఉక్కుర్తి లక్ష్మణ్,గోపి, శ్రీధర్,సంజీవ,ప్రవీణ్,లక్ష్మారెడ్డి, వేణు రెడ్డి,వెంకటేశం,రమణ, వెంకటేశ్వర్లు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.







# కణితి హై స్కూల్ లో జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ సెలక్షన్ పోటీలు ప్రారంభం.

- **ముఖ్య అతిధులుగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాధం (జగన్)**

**గాజువాక,నవంబర్ 18(ప్రజాస్వరం):**

గాజువాక నియోజకవర్గం 87వ వార్డ్ పరిధిలో కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ సెలక్షన్ పోటీలు ప్రారంభం అయ్యాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతితులుగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి స్థానిక వార్డ్ కార్పొరేటర్ బోండా జగన్నాధం (జగన్) పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు అనంతరం ముఖ్య అతిదులు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాలో ఉన్న అండర్ 14 బాల బాలికలను హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక ప్రక్రియ మన కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించడం ఆనందకరంగా ఉందని, గతంలో రాష్ట్రస్థాయి అండర్ 14 నెట్ బాల్ పోటీలో ఇక్కడ నిర్వహించడం జరిగిందని అందులో మన కణితి స్కూలుకు ప్రథమ బహుమతి రావడం జరిగిందని గుర్తు చేసుకున్నారు. పిల్లలు చదువుతో పాటు క్రీడలలో మంచి ప్రతిభ కనపర్చాలని ఇంత మంచి కార్యక్రమంలో నన్ను భాగస్వామ్యం చేసిన స్కూల్ యాజమాన్యం వారికి ధన్యవాదములు తెలియజేసుకున్నారు.అనంతరం పిల్లలను పరిచేయం చేసుకొని పోటీలను ప్రారంభించారు.ఈ కార్యక్రమం లో ఎస్ జి ఎఫ్ అడ్మిన్ సెక్రెటరీ వై యామిని పద్మనీ ప్రియ, హెచ్ఎం,కణితి pds,అల్ pds,వార్డ్ అధ్యక్షులు విజయరామరాజు,లెనిన్ బాబు, ఆనంద్ కుమార్,భాగ్య లక్ష్మి,బోండా శ్రీను, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# వీరాంజనేయ స్వామి దేవస్థాన వార్షికోత్సవం

**కాప్రా,నవంబర్ 18(ప్రజాస్వరం):**

జమ్మిగడ్డ బీజెఆర్ కాలనీలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో వార్షికోత్సవ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. సీనియర్ నాయకుడు పాకాల రాజన్న పిలుపుతో కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఏఎస్ రావు నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్,స్టేట్ ఓబీసీ కన్వీనర్ మేదరి రామలింగం, డివిజన్ ఎస్సీసెల్ అధ్యక్షుడు తాడూరు అనిల్‌కుమార్,భద్రగామ నర్సింహ, జమ్మిగడ్డ శ్రీనివాస్, కె.ప్రకాశ్,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేసి, దేవస్థాన అభివృద్ధికి సహకారం అందిస్తామని నేతలు తెలిపారు.



# కాప్రా తహసీల్దార్ కార్యాలయంలో నిర్లక్ష్యం

**కాప్రా,నవంబర్ 18(ప్రజాస్వరం):**

కాప్రా తహసీల్దార్ కార్యాలయంలో ధృవపత్రాల జారీ తీవ్రంగా ఆలస్యమవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. “రేపు రండి” అంటూ తిరస్కరించడంతో నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు సమయానికి రాకపోవడం, సమస్యలు వినకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తమైంది. ఈ పరిస్థితిపై మేడ్చల్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు, కాప్రా డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ పత్తి కుమార్ మండిపడి— ప్రజలను అవమానించే విధంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా విమర్శించిన ఆయన, త్వరలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.






# మధుమేహం వల్ల కంటి సమస్యలపై అవగాహన

- **కలెక్టర్ ఆదర్శ్ సురభి ఉచిత స్క్రీనింగ్, వసతిగృహ నిర్మాణ పనులను సమీక్ష**

**వనపర్తి,నవంబర్ 18(ప్రజాస్వరం):**

మధుమేహం కారణంగా కంటి చూపులో సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉన్నందున ప్రజల్లో అవగాహన కల్పించడం, "దృష్టి" కార్యక్రమం ద్వారా సమగ్ర స్క్రీనింగ్ నిర్వహించడం ద్వారా ఆరోగ్య సేవలను బలోపేతం చేయాలని వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బండారు నగర్ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో, ఇందిరానగర్ కాలనీలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కొనసాగుతున్న మధుమేహ దృష్టి ఉచిత శిబిరాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా, మధుమేహ రోగులకు నిర్వహిస్తున్న రేటినోపతి స్క్రీనింగ్ కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ, మిషన్ మధుమేహ దృష్టి స్క్రీనింగ్ వేగవంతంగా జరగడం, ప్రతి అర్హుడికి పరీక్షలు నిర్దిష్టంగా జరగడం ముఖ్యమని పేర్కొన్నారు. శిబిరాలకు రాబోయే రోగులను ఎక్కువ సేపు వేచి ఉండనీయకుండా, త్వరగా స్క్రీనింగ్ పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని కూడా ఆదేశించారు. నూతన బాలికల వసతిగృహ భవన నిర్మాణాన్ని కలెక్టర్ పరిశీలన అదేవిధంగా, జిల్లా కేంద్రంలోని పీర్లగుట్టలో నిర్మిస్తున్న సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహ భవనాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. భవనం నాణ్యంగా, భద్రతా ప్రమాణాలతో నిర్మించబడేలా సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సూచనల ప్రకారం, కొత్త వసతి గృహ భవనం జనవరి 26 వరకు పూర్తి చేసి ప్రారంభించాలి. భవన ప్రారంభం తర్వాత బాలికలకు సమర్థవంతమైన వసతులు,సౌకర్యాలు అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన విధంగా గుత్తేదారుకు సూచనలు ఇచ్చారు. పరిశీలనలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సాయినాథ్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ రామచంద్రరావు,పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు,ఇతర అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.



# పాత బస్టాండ్ పునఃప్రారంభం

- **ప్రజల పోరాట ఫలితం.**
- **సతీష్ యాదవ్.**

**వనపర్తి,నవంబర్ 18 (ప్రజాస్వరం):**

నాలుగు సంవత్సరాల నిరంతర పోరాటం ఫలితంగా గత 20 ఏళ్లుగా మూతపడిన పాత బస్టాండ్ ను సోమవారం స్థానిక అధికారులు అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంలో అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా. సతీష్ యాదవ్ మంగళవారం పాత బస్టాండ్ ను సందర్శించి మాట్లాడుతూ, ఈ విజయానికి అఖిలపక్ష ఐక్యవేదిక, ప్రజాసంఘాలు, స్థానికులు చేసిన పోరాటం కారణమని చెప్పారు. సతీష్ యాదవ్ మాట్లాడుతూ, "ప్రజల కోసం నిరంతరం పోరాటం చేస్తే ఇలాంటి విజయాలు సాధించవచ్చు. గత నాలుగు సంవత్సరాలుగా మేము చేసిన ప్రయత్నాలు ఫలితంగా అధికారులు స్పందించి బస్టాండ్‌ను మళ్లీ ప్రారంభించారు. ప్రత్యేకంగా పత్రికా మరియు మీడియా మిత్రులకు ధన్యవాదాలు." అలాగే, సుందరీకరణ కోసం ఎమ్మెల్యే, మంత్రి, కలెక్టర్ ద్వారా నిధులు కేటాయించి రోడ్లు, మరుగుదొడ్లు, ప్రజలు ఉండడానికి తగిన నీడ కల్పించాలని, 40 ఏళ్లుగా అక్కడ వ్యాపారం చేస్తున్న చిరు వ్యాపారులకు రక్షణ, శాశ్వత షాపులు ఏర్పాటు చేయాలని, ఆర్టీసీ సిబ్బందిని నియమించి చుట్టూ ఉన్న ప్రజలు పాత బస్టాండ్ పరిసరాలలో మూత్రాలు చేయకుండా కట్టడి చేయాలని, లేకుంటే దుర్గంధం ఏర్పడి ఎవరు లోపలికి రారని సూచించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు, ప్రజాసంఘాల నేతలు,ఆర్టీసీ కార్మికులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.








### బూత్, వార్డు కమిటీల ఏర్పాటుపై

# వాసుపల్లి ఆదేశాలు..

- **కష్టపడే వారికి ప్రాధాన్యత కల్పించండి..**
- **దక్షిణ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్**

**విశాఖపట్నం,నవంబర్ 18(ప్రజాస్వరం):** వైయస్సార్సీపి అధిష్టానం ఆదేశాల మేరకు వార్డు అనుబంధ, బూత్ కమిటీలు ప్రతిష్టాత్మకంగా త్వరితగతిన పూర్తి చేయాలని దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ వార్డు అధ్యక్షులకు ఆదేశించారు. 39, 38,35 వార్డులలో పర్యటించి ఆయా వార్డు అధ్యక్షులతో సమావేశం అయ్యారు. 35 వ వార్డు అధ్యక్షుడు కనక రెడ్డి పూర్తిచేసిన ఆయా కమిటీ వివరాలను వాసుపల్లి గణేష్ కుమార్ కు ముందుగానే అందజేశారు. అనంతరం 39 వ వార్డు ముజుబ్ ఖాన్, 38వ వార్డు గురజాపు రవితో వారి కార్యాలయాల వద్ద కలిసి సమావేశమయ్యారు. అధిష్టానం సీరియస్ ఆదేశాలు జారీ చేసిందని, కష్టపడే వారికి కమిటీలో చోటు కల్పించి పూర్తి చేసిన నివేదికను త్వరితగతిన అందజేయాలని వాసుపల్లి గణేష్ కుమార్ ఆదేశించారు. వైయస్సార్సీపి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు సంస్థాగతంగా మరింత బలపడాలని, బూతు, వార్డు, అనుబంధ సంఘాల కమిటీల్లో మంచి కార్యకర్తలకు చోటు కల్పించాలని వెల్లడించారు ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి జిల్లా సెక్రెటరీ అబ్బిరెడ్డి ఆదివిష్ణు,జిల్లా బీసీ సెల్ ప్రెసిడెంట్ సనపల రవీంద్ర భారత్,సౌత్ నాయకులు,జిల్లా నాయకులు,వార్డ్ నాయకులు, వార్డ్ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

### జమ్మిగడ్డలో కంచె గట్టు పనులు

# త్వరలో ప్రారంభం

**కాప్రా,నవంబర్ 18(ప్రజాస్వరం):** కాప్రా మున్సిపల్ పరిధిలోని జమ్మిగడ్డలో సర్వే నంబరు 199లో ఉన్న తొమ్మిది ఎకరాలు ఇరవై రెండు గుంటల ప్రభుత్వ భూమికి హద్దులు గుర్తించారు. స్టేడియం కోసం కేటాయించిన ఈ భూమి రక్షణలో భాగంగా పురపాలక, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా పరిశీలన నిర్వహించాయి. త్వరలో కంచె గట్టు పనులు ప్రారంభించేందుకు అధికారులు సిద్ధం చేశారు. గతంలో పన్నెండు ఎకరాలు ఉన్న ఈ భూమి కాలక్రమేణా తగ్గిపోవడంతో దానిని కాపాడాల్సిన అవసరం ఉందని స్థానికులు భావించారు. స్మశానవాటికకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కమిటీ కన్వీనర్ తాడూరి గగన్ కుమార్ కోరారు.



## ఊపిరి కాపాడుకోవాలంటే సిగరెట్లు ఆపాలి:రాచకొండ సీపీ

**హైదరాబాద్,నవంబర్ (ప్రజాస్వరం):** పొగతాగేవారిలో సీఓపీడీ (ఊపిరితిత్తుల నయం కాని వ్యాధి) కేసులు అధికంగా నమోదవుతున్నాయని రాచకొండ సీపీ జి. సుధీర్‌బాబు తెలిపారు. అంతర్జాతీయ సీఓపీడీ డే సందర్భంగా కామినేని ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ— "20ల్లో చేసిన పొగతాగే తప్పులకు 60ల్లో శిక్ష పడుతుంది. సీఓపీడీని గుర్తించడానికి పీఎఫ్టీ పరీక్షే మార్గం" అన్నారు. కామినేని హాస్పిటల్స్ వారు పీఎఫ్టీ పరీక్షను ఈ నెల 22 వరకు రూ.400కే అందిస్తున్నట్లు వెల్లడించారు. సీనియర్ పల్మనాలజిస్ట్ డా. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ"పొగతాగిన సంవత్సరాల మేరకు సీఓపీడీ ప్రమాదం ఎక్కువ. పొయ్యి పొగ,వాయుకాలుష్యం కూడా కారణాలు. వ్యాధి ఉన్నవారు న్యుమోనియా,ఇన్ఫ్లుయెంజా టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలి" అని సూచించారు.










# "డ్రగ్స్‌కు 'నో' చెప్పండి...మీ భవిష్యత్తును మీరు కాపాడుకోండి"

- **వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్.**

**వనపర్తి,నవంబర్ 18 (ప్రజాస్వరం):** యువతను మాదకద్రవ్యాల బారినుంచి రక్షించడం సమాజం మొత్తం బాధ్యత అని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్య కళాశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాబృందం ప్రదర్శనల అనంతరం ఎస్పీ పర్యవేక్షణలో విద్యార్థులు, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది కలిసి డ్రగ్స్‌కు దూరంగా ఉండే ప్రతిజ్ఞ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ "మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది. ఒక్క క్షణం ఉత్సాహం కోసం తీసుకునే తప్పు నిర్ణయం జీవితం మొత్తాన్ని నాశనం చేస్తుంది. డ్రగ్స్ ఫ్యాషన్ కాదు.అది విజయానికి శత్రువు. ఎవరైనా తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నించినా ధైర్యంగా 'నో' చెప్పండి. మాదకద్రవ్యాలు వ్యక్తినే కాదు... ఒక కుటుంబాన్ని, ఒక భవిష్యత్తును నాశనం చేస్తాయి" అని హెచ్చరించారు. "పోలీసుల బాధ్యత కేవలం చట్టం అమలు చేయడం మాత్రమే కాదు... భవిష్యత్ తరాలను రక్షించడం కూడా. వనపర్తిని డ్రగ్స్ రహిత జిల్లా దిశగా ప్రజలంతా కలిసి ముందడుగు వేయాలి" అని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వీరారెడ్డి ,ప్రిన్సిపాల్ డా. మల్లికార్జున్,జిల్లా సంక్షేమ అధికారి చెన్నమ్మ తామస్,ఎక్సైజ్ సీఐ వెంకట్ రెడ్డి,వనపర్తి సీఐ కృష్ణయ్య,పోలీసులు, అధ్యాపకులు,కళాబృంద సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



### యువత మత్తు పదార్థాలకు

# దూరంగా ఉండాలి.

- **మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు**

**వనపర్తి,నవంబర్ 18 (ప్రజాస్వరం):** యువత భవిష్యత్ దేశ భవిష్యత్తు కావడంతో వారు ఎలాంటి పరిస్థితుల్లోనూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వనపర్తి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా మున్సిపల్ కార్యాలయం నుండి అంబేద్కర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న మహిళలు, సిబ్బందికి కమిషనర్ ముఖ్య సూచనలు చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, "డ్రగ్స్ ఒక్క వ్యక్తి జీవితాన్నే కాదు, కుటుంబాన్ని, సమాజాన్ని కూడా దెబ్బతీస్తాయి. చిన్న తప్పు జీవితాన్ని చీకటి లోయల్లోకి నెట్టేస్తుంది. డ్రగ్స్‌ను స్నేహితుల పేరుతో, ఫ్యాషన్ పేరుతో ప్రయత్నించే అలవాటు చాలా ప్రమాదకరం. దీనిని నిరోధించడానికి ప్రతి కుటుంబం, ప్రతి పాఠశాల, కాలేజీ అప్రమత్తంగా ఉండాలి. యువతకు సమయానికి అవగాహన కల్పించడం అత్యంత అవసరం" అని తెలిపారు. అలాగే యువతను మోసం చేసే డ్రగ్ మాఫియాలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని, అయితే సమాజం సహకారం లేకుండా ఈ పోరు పూర్తి కాలేదని ఆయన అన్నారు. డ్రగ్స్ వినియోగం పెరిగితే నేరాలు, ఆరోగ్య సమస్యలు, మానసిక ఆందోళనలు పెరుగుతాయని హెచ్చరించారు. ర్యాలీ అనంతరం మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని, వాటి వ్యాపారాన్ని చూసినప్పుడు సంబంధిత అధికారులకు తెలియజేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు మాదారి భోజరాజు,మద్దెల కరుణాకర్,మున్సిపల్ మెప్మ సిబ్బంది,మహిళలు పాల్గొన్నారు.







# డ్రగ్స్ రహిత జిల్లా మా లక్ష్యం..

- **సమాజం తోడుంటే సాధ్యం**
- **డ్రగ్ మాఫియాపై కఠిన చర్యలు**
- **ఎస్పీ రావుల గిరిధర్వ**

**నపర్తి,నవంబర్ 18 (ప్రజాస్వరం):** వనపర్తి జిల్లాను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడే దిశగా పోలీసు శాఖ సంకల్పబద్ధంగా ముందుకు సాగుతోంది. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో "నషా ముక్తా భారత్ అభియాన్" ఐదేళ్లు పూర్తి అయిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఆధ్వర్యంలో పోలీసులు సామూహిక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ గిరిధర్ మాట్లాడుతూ— "డ్రగ్స్ రహిత వనపర్తి మా లక్ష్యం. సమాజం తోడుంటే ఇది అసాధ్యమనేది కాదు. డ్రగ్స్ యువతను, కుటుంబాలను శాశ్వతంగా నాశనం చేస్తాయి. అందుకే ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలి" అని పిలుపునిచ్చారు. చట్టపరమైన చర్యలతో పాటు అవగాహన కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని, డ్రగ్స్ చెలామణీ, రవాణా, విక్రయాలు ఏ రూపంలోనైనా జరుగుతుంటే వెంటనే డయల్ 100 లేదా టోల్ ఫ్రీ 1908కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఇక డ్రగ్ మాఫియాపై కఠిన చర్యలను చేపట్టే దిశగా ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతోందని ఎస్పీ తెలిపారు. "డ్రగ్స్‌పై ఏ మాత్రం రాజీపడము. యువతను రక్షించడం మా బాధ్యత మాత్రమే కాదు—మా ధర్మం కూడా. ప్రతి పోలీసు, ప్రతి యువకుడు యాంటీ నార్కోటిక్ డ్రగ్ వారియర్‌గా మారాలి" అని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనలో మార్పులు గమనించి, అవసరమైనప్పుడు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. డ్రగ్స్ వ్యాప్తిని అరికట్టడంలో సమాజం-పోలీసుల సమన్వయం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, డిసిఆర్బి డీఎస్పీ బాలాజీ నాయక్,వనపర్తి సీఐ కృష్ణయ్య, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్,రిజర్వ్ ఇన్స్పెక్టర్లు అప్పలనాయుడు,శ్రీనివాస్,జిల్లా పోలీస్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యువతకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనందిస్తున్నది

**పూతలపట్టు,నవంబర్ 18(ప్రజాస్వరం):** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశ్రమల ఏర్పాటుకు యువతను ప్రోత్సహిస్తుందని చిత్తూరు ఎంపీ దగ్గుమండల ప్రసాద్ రావు అన్నారు. పూతలపట్టు మండల కేంద్రంలో పూతలపట్టుకు చెందిన ముత్తు నిర్మించిన ఆర్ వి ఇండస్ట్రీస్‌ని ఎంపీ మంగళవారం ప్రారంభించారు. ఇండస్ట్రీస్లో ఎంపీ ఆపరేటింగ్ చేసి ప్రారంభించాడు. ఇంట్రెస్ట్ తీసిన తయారీ పరికరాల గురించి ఇండస్ట్రీస్ అధినేత ఎంపీకి వివరించాడు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ముత్తు స్వయంకృషితో ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరిగి సొంతంగా పరిశ్రమను ఏర్పాటు చేసుకొని కొంతమందికి ఉపాధి కల్పిస్తున్నాడని. ప్రతి యువకుడు ముత్తును ఆదర్శంగా తీసుకొని ఏదో ఒక రంగంలో యువత అభివృద్ధి చెందాలని ఆయన యువతకు పిలుపునిచ్చాడు. రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి డాక్టర్ సప్తగిరి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందించడం వల్లే ముత్తు ఇంట్రెస్ట్ పెట్టి అభివృద్ధి చెందుతున్నాడని తెలిపారు. పూతలపట్టు మండల కేంద్రంలో గత పది సంవత్సరాలుగా కష్టపడుతూ పరిశ్రమ ఏర్పాటు చేసి పది మందికి ఉపాధి కల్పిస్తున్నాడని ఆయన కొనియాడారు.ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా పరిశ్రమల కేంద్రం సూరిబాబు,ఏడి చంద్రశేఖర్ రెడ్డి,జిల్లా కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ పూర్ణం,గల్లా అరుణ కుమారి పిఏ బాలకృష్ణారెడ్డి,టిడిపి యువ నాయకుడు గుంటూరు మురళి నాయుడు,నాయకులు సునీల్ చౌదరి ఇందిరమ్మ,సుబ్బరాజులు, చిన్న బండపల్లి వేణు,నటరాజన్, వీరభద్రయ్య,రమేష్ బాబు, కస్తూరి,జనసేన నాయకులు మహేష్ సర్వో,శాంతి మూర్తి ,పవన్ కుమార్,హరి ప్రసాద్,బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు





## వివాహ వేడుకల్లో పాల్గొన్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**వలిగొండ,నవంబర్ 18(ప్రజాస్వరం):** భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని ముద్దాపురం క్రాస్ రోడ్ లో ఉన్న శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి ఫంక్షన్ హాల్లో జరిగిన వలిగొండ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సామ సరస్వతి రాంరెడ్డి, కుమారుడు సామ సూర్య ప్రకాష్ రెడ్డి మానస వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన గౌరవ మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి, మాజీ ఎంపీపీ చిట్టెడి జనార్దన్ రెడ్డి, మాజీ ఎంపిటిసి బెల్దే నాగేశ్వర్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు మహమ్మద్ అబ్దుల్ రావుఫ్ , బండారునర్సిరెడ్డి,జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు జినుకల కృష్ణ యాదవ్,రెడ్లరేపాక మాజీ ఉపసర్పంచ్ కందుల నరేష్, ముద్దపురం మాజీ ఉపసర్పంచ్ వెంకట్ రెడ్డి,నర్సిరెడ్డి,మీసాల ముత్యాలు రాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సికింద్రాబాద్ తహసీల్దార్ ఆఫీస్ లో ఏసీబీ దాడులు..

- **రూ.లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడిన సర్వేయర్**

**సికింద్రాబాద్ నవంబర్ 18 ( ప్రజాస్వరం ) :**

సికింద్రాబాద్ మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అవినీతి నిరోదక శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. పిర్యాదుదారుడిని నుంచి రూఒక లక్ష లంచం సొమ్ము తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా మండల సర్వేయర్ కలువ కిరణ్ కుమార్, చైన్ మెన్ గా పనిచేస్తున్న మేకల భాస్కర్ లను పట్టుకున్నారు. వివరాలు ఇవి.. ఫిర్యాదుదారుని ఆస్తి సంబంధించిన నోటీసుపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా అధికారిక అనుకూలం చూపించేందుకు మండల సర్వేయర్ కిరన్ మొత్తం రూ.3 లక్షల లంచం డిమాండ్ చేశాడు. మొదటి విడతగా రూ.1 లక్షను చైన్ మెన్ భాస్కర్ ద్వారా స్వీకరించిన సమయంలో ఎసిబి అధికారులు లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. లంచం తీసుకోవడం ద్వారా ఇద్దరు అధికారులు తమ విధులను అక్రమంగా నిర్వహించి అనుచిత లాభం పొందేందుకు ప్రయత్నించినట్లు ఎసిబి పేర్కొంది. అనంతరం వారి ఇద్దరిని అరెస్ట్ చేసి నాంపల్లి ఎస్పీఈ,ఏసీబీ ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపరచారు. కేసు దర్యాప్తులో ఉన్నందున ఫిర్యాదుదారుని వివరాలు భద్రత కోసము వెల్లడించడం లేదని ఏసీబీ అధికారులు తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేసిన పక్షంలో, ప్రజలు ఎసిబి టోల్ ఫ్రీ నంబర్ 1064 కు ఫిర్యాదు చేయాలని ఎసిబి విజ్ఞప్తి చేసింది. అదనంగా వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్, ట్విట్టర్ ద్వారా కూడా సంప్రదించవచ్చన్నారు. ఫిర్యాదుదారుల వివరాలను రహస్యంగా ఉంచుతామని ఎసిబి స్పష్టం చేసింది.





## కాంగ్రెస్ నేతలు మంచాలను పరామర్శ

**చేర్యాల నవంబర్18,ప్రజాస్వరం**

చేర్యాల పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సినియర్ నేత, కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంచాల చిరంజీవులు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేట్ హాస్పిటల్లో వైద్య చికిత్స అనంతరం చేర్యాల పట్టణంలోని వారి నివాసనికి వచ్చిన నేపథ్యంలో విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొమ్ము రవి, బ్లాక్ కాంగ్రెస్ చేర్యాల అధ్యక్షులు మంజే మల్లేశం లు కలిసి మంచాల చిరంజీవి, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆరోగ్య స్థితిగతులు అడిగి తెలుసుకుని మనోధైర్యాన్ని ఇచ్చారు.

## డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు వాడకూడదు...

- **గాంధీలో వరల్డ్ యాంటీ బయాటిక్ వారోత్సవాలు...**

**సికింద్రాబాద్, నవంబర్ 18 ( ప్రజాస్వరం):**

డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా , నేరుగా మందులు కొనుక్కొని వేసుకోకూడదని వైద్య నిపుణులు సూచించారు. వరల్డ్ యాంటీబయాటిక్ వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరైన మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా, సూపరింటెండెంట్ డా.వాణి ప్రసంగించారు వివిధ రోగాల ట్రీట్మెంట్ కు డాక్టర్లను సంప్రదించే రోగులు డాక్టర్లు వ్రాసిన యాంటీబయాటిక్ ప్రిస్క్రిప్షన్ వాడాలన్నారు. డాక్టర్లు ఇచ్చిన కోర్సు పూర్తయ్యే వరకు ప్రిస్క్రిప్షన్ లోని మందులు వాడాలని, మధ్యలో ఆపకూడదన్నారు. యాంటీబయాటిక్ ప్రిస్క్రిప్షన్ ను మధ్యలో నిలిపివేస్తే జబ్బు నయం కాకపోవచ్చన్నారు. ప్రిస్క్రిప్షన్స్ లోని మందులను తప్పనిసరిగా వాడాలన్నారు. డాక్టర్లను సంప్రదించకుండా మెడిసిన్స్ కావాలని నేరుగా వచ్చే రోగులకు ఫార్మసిస్టులు మందులను ఇవ్వకూడదన్నారు. ఈసందర్భంగా యాంటీ బయాటిక్ వాడకంపై ర్యాలీ నిర్వహించారు. గాంధీ మెడికల్ కళాశాల మైక్రో బయాలజీ విభాగం హెచ్ ఓ డి డాక్టర్ సురేఖ, ఆర్ఓంవో డాక్టర్ బ్రహ్మేశ్వర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రమేష్, మైక్రో బయాలజీ విభాగం, అండర్ గ్రాడ్యుయేట్స్ విద్యార్థులు పాల్గొన్నారు.




### రాష్టంలో 'రేవంత్' పాలనలో

## రావణ కాష్టంగా మారింది..!

- **అక్రమ కేసులపై మండిపడ్డ ఎమ్మెల్యే**

**దుబ్బాక, నవంబర్ 18, ప్రజాస్వరం :**

సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో పరిపాలన అరాచకంగా మారిందని, పోలీస్ చర్యలు రావణ కాష్టమును తలపిస్తున్నాయని దుబ్బాక శాసన సభ్యులు, జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొత్త ప్రభాకర్ రెడ్డి మండిపడ్డారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ... మెదక్ లో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మామిళ్ల ఆంజనేయులు పై అక్రమ ఎస్సీ ఎస్టీ కేసు నమోదు పై మాజీ ఎమ్మెల్యే, మెదక్ జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు ఎం. పద్మాదేవేందర్ రెడ్డి తో కలిసి ఆయన మాట్లాడారు... ప్రజా పాలన అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకుల పై అక్రమ కేసులు పెడుతూ ప్రజాస్వామ్యాన్ని మంటగల్పుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మామిళ్ల ఆంజనేయులు ఎం తప్పు చేశారని ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశారని ఆయన ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి హోం మంత్రి శాఖను నిర్వహిస్తుండగా పోలీసులు కక్షపూరిత చర్యలకు పాల్పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. బిఆర్ఎస్ హయాంలో ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ కొనసాగిందని, అధికార ప్రతిపక్ష నాయకులకు సమాన ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. నేడు పోలీస్ స్టేషన్ కు వెళ్తే సీనియర్ ప్రజా ప్రతినిధులకు నాయకులకు కూడా కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. అధికారం శాశ్వతం కాదని అధికారులు పద్ధతి ప్రకారం నడుచుకోవాలని ఆయన హితువు పలికారు. ప్రజాస్వామ్య బద్దంగా ధర్నా ఆందోళన చేయడానికి వెళ్లినా పోలీసులు అరెస్టు చేస్తున్నారని, మానవ హక్కులు మంటగలుపుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం హయంలో మీరు ఆందోళనలు ధర్నాలు చేయలేదా అని ఆయన ప్రశ్నించారు. సోషల్ మీడియాలో చిన్న పోస్ట్ పెడితే కూడా అక్రమ కేసులు పెడుతూ అరెస్టు చేస్తున్నారని, మరి మీ కాంగ్రెస్ పార్టీ నాయకులు పెడుతున్న సోషల్ మీడియా పోస్టులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ అక్రమ కేసుల విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డీజీపీ దృష్టికి తీసుకెళ్లామని, లిఖిత పూర్వకంగా పిర్యాదు చేయడం జరిగిందని చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. లేని పక్షంలో నియంత పాలనకు ప్రజలే చరమగీతం పాడుతారని ఆయన హెచ్చరించారు. అక్రమ కేసులపై భయపడేది లేదని, కార్యకర్తలకు అండగా ఉంటామని ఆయన పేర్కొన్నారు.



## పారాక్వాట్ విషం తాగిన 12 ఏండ్ల బాలుడు

- **ప్రపంచంలోనే తొలిసారి ఊపిరి తిత్తుల మార్పిడి చేసి కాపాడిన వైద్యులు**
- **యశోదా ఆసుపత్రి వైద్య నిపుణుల అరుదైన విజయం**

**సికింద్రాబాద్, నవంబర్ 18 ( ప్రజాస్వరం):**

పారాక్వాట్ అనే ప్రమాదకరమైన కలుపు మందు తాగి ప్రాణాపాయంలో ఉన్న 12 ఏళ్ల అనురాగ్ సందీప్‌కు సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ విజయవంతంగా ద్వైపాక్షిక ఊపిరితిత్తుల మార్పిడి చేసి అరుదైన విజయాన్ని సాధించింది. ఇలాంటి విషం సేవించిన పిన్న వయస్కుడికి ప్రపంచంలోనే మొదటిసారిగా లంగ్ ట్రాన్స్ ప్లాంట్ చేయడం ఇది. పెద్దపల్లి జిల్లా ఓదెల గ్రామానికి చెందిన అనురాగ్ మార్చిలో పారాక్వాట్ తాగడంతో ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఏప్రిల్ 21న సోమాజిగూడ యశోద హాస్పిటల్ చేరిన ఆయనకు ఎక్మో సహా అత్యవసర చికిత్స అందించినా ఊపిరితిత్తుల పరిస్థితి మరింత క్షీణించింది. దీంతో వైద్యులు లంగ్ ట్రాన్స్ ప్లాంట్‌కే మార్గం ఉందని నిర్ణయించారు. జీవన్ దాన్ ద్వారా లభించిన దాత ఊపిరి తిత్తులను 12 ఏళ్ల శరీర7 పరిమాణానికి సరిపోయేలా ఖచ్చితత్వంతో శస్త్రచికిత్స నిపుణులు సర్దుబాటు చేసి హైటెక్‌సిటీ యశోదలో బైలాటరల్ లోబార్ లంగ్ ట్రాన్స్ ప్లాంట్‌ను విజయవంతంగా నిర్వహించారు. శస్త్రచికిత్స తర్వాత ఐసీయూలో రెండు వారాలపాటు పర్యవేక్షణలో ఉంచి కోలుకున్న ఆయనను అనంతరం డిశ్చార్జ్ చేశారు ఈ అరుదైన శస్త్రచికిత్సను యశోద హాస్పిటల్స్ వైద్య బృందం డాక్టర్ పవన్ గోరుకంటి, డాక్టర్ విశ్వేశ్వరన్ బాలసుబ్రమనియన్, డాక్టర్ చేతన్ రావు, డాక్టర్ పంక్తి శేత్, డాక్టర్ రమ్య రెడ్డి మరియు సర్జన్లు డాక్టర్ కె.ఆర్. బాలసుబ్రమణియన్, డాక్టర్ మంజునాథ్ బేల్ సంయుక్తంగా పూర్తిచేశారు. ఈ విజయం తెలుగు రాష్ట్రాలకు గర్వకారణమని హాస్పిటల్ ప్రకటించింది.




## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే రైతులకు ఇబ్బందులు

**హైదరాబాద్, నవంబర్ 18(ప్రజాస్వరం ):**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా పత్తి రైతులు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. మంగళవారం పత్తి రైతులను ఆదుకోవాలని కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. పత్తి విక్రయాలకు సీసీఐ అనేక కొర్రీలు పెట్టిందని, వీటి గురించి రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో తాను సివిల్ సప్లయ్ మినిస్టర్‌గా పని చేసినపుడు దొడ్డు వడ్లు తీసుకోమని కేంద్రం కొర్రీలు పెడితే రాష్ట్ర కేబినెట్ మొత్తం 11 రోజులు ఢిల్లీలో ఉండి సమస్యను పరిష్కరించామని గుర్తు చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఢిల్లీ వెళ్లి సీసీఐతో కొట్లాడి రాష్ట్ర రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు పత్తి అమ్ముకోకుండా.. మిల్లర్లు కొనకుండా సీసీఐ అనేక కొర్రీలు పెట్టిందని, ఈ కారణంగానే జిన్నింగ్ మిల్లులు మూత పడ్డాయని అన్నారు. సీసీఐ నిబంధనలు సడలించి పత్తి కొనుగోళ్లు సరిగ్గా జరిగేలా చర్యలు తీసుకోవాలని, లేదంటే రైతుల పక్షాన తమ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల పత్తి బస్తాలు మోసుకుంటూ కలెక్టరేట్‌కు వచ్చారు. మెయిన్ గేటు వద్ద గంటపాటు ధర్నా నిర్వహించారు.. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, జిల్లా అధ్యక్షులు జీవీ రామకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.







## పొలాల్లోకి పరుగులెత్తిన ఎస్ఐ

- **వెంబడించి పట్టుకున్న ఏసీబీ అధికారులు...**
- **ఎస్ఐ నీ పట్టుకున్నందుకు టపాసులు కాల్చడం గమనార్హం...**

**మెదక్ నవంబర్ 18 (ప్రజా స్వరం)**

ఏసీబీ ట్రాప్ ను గమనించిన ఎస్ఐ పోలీసు స్టేషన్ వెనుక వైపు గోడ దూకి, పొలాల మీదుగా పరుగులు తీశాడు. సినీ ఫక్కీలో జరిగిన ఈ సంఘటన మెదక్ జిల్లా టెక్మాల్ పోలీస్టేషన్ వద్ద జరిగింది. ఎస్ఐ ను పట్టుకునేందుకు అక్కడే మాటు వేసిన సుమారు 15 మంది ఏసీబీ సిబ్బంది వెంబడించి పట్టుకున్నారు. ఏసీబీ కి ఎస్ఐ రాజేశ్ చిక్కినట్లు తెలియడంతో స్థానికులు టపాసులు పేల్చి కేరింతలు కొట్టారు. టెక్మాల్ మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన రైతు అద్దెకు తీసుకొచ్చిన హార్వెస్టర్ బ్యాటరీ చోరీ సంఘటనపై ఫిర్యాదు చేశాడు. ఈ కేసు పరిష్కరించడానికి అసద్ మహమ్మద్ పల్లి కి చెందిన రైతు పాండుకు స్థానిక ఎస్ఐ రాజేష్ 50 వేలు డిమాండ్ చేసినట్లు తెలుస్తుంది. ఒప్పందం ప్రకారం మొదటి దఫా గా 30వేలు బాధితుడు ఇచ్చాడు. అనంతరం బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ రోజు టెక్మాల్ పోలీస్ స్టేషన్లో బాధితుడు 20 వేలు ఎస్ఐ కు ఇచ్చి వెళ్తుండగా ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఏసీబీ ట్రాప్ పై అనుమానం వచ్చిన ఎస్ఐ పోలీస్ స్టేషన్ గోడ దూకి అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించాడు. దాదాపు 15 మందితో కూడిన అవినీతి నిరోధక శాఖ అధికారుల బృందం పొలాల్లో పరిగెత్తుతున్న ఎస్ఐ ను వెంబడించి పట్టుకున్నారు. టెక్మాల్ పోలీస్ స్టేషన్ లో అధికారుల కొనసాగుతున్నాయి. కాగా ఓ వైపు ఏసీబీ అధికారులు ఎస్ఐ ని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని విచారిస్తుండగా మరోవైపు స్థానికులు టపాసులు పేల్చడం గమనార్హం....




## జోగులాంబ గద్వాల్ పోలీస్

- **ఎస్.ఆర్.విద్యానికేతన్‌లో భరోసా అవగాహనా కార్యక్రమం**

**జోగులాంబ గద్వాల జిల్లా, నవంబర్ 18(ప్రజాస్వరం):**

జిల్లా ఎస్పీ శ్రీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్., ఆదేశానుసారం లైంగిక దోపిడీ, దుర్వినియోగం మరియు హింస నివారణ, అలాగే బాధితుల పునరావాసం & స్వస్థత కోసం జోగుళాంబ గద్వాల్ జిల్లా భరోసా కేంద్రం ఆధ్వర్యంలో ఎస్.ఆర్. విద్యా నికేతన్ లో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పోక్సో చట్టం, అందులోని శిక్షలు,భరోసా కేంద్రం అందించే సేవలు,మొబైల్ ఫోన్ దుర్వినియోగం వల్ల కలిగే ప్రమాదాలు,అలాగే యుక్తవయసులో వచ్చే ఆకర్షణలపై జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సురక్షిత వాతావరణం, తమనుతాము రక్షించుకోవడం, మరియు హింసను వెంటనే తెలియజేయాలనే చైతన్యం పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో గద్వాల రూరల్ ఎస్సై శ్రీకాంత్, భరోసా సెంటర్ ఎస్సై తారక,కోఆర్డినేటర్ శివాని, సపోర్ట్ పర్సన్ స్రవంతి,స్కూల్ డైరెక్టర్ రాముడు,వైస్ ప్రిన్సిపాల్ సుచరిత మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

### రాజకీయ పార్టీ నాయకులకు పట్టదా..?

## దళితులంటే లెక్కలేదా..?

- **ఓట్ల కోసం మీ కార్యక్రమాల ఊరేగింపుల కోసమే దళితులు కావాలా..?**
- **హత్యపై రాజకీయ పార్టీల వైఖరిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ హెచ్చరిక**
- **ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పెంటనోళ్ళ నరసింహ మాదిగ**

**షాద్ నగర్ నవంబర్ 18(ప్రజాస్వరం):**

ఎల్లంపల్లి గ్రామంలో యాదవ కులానికి సంబంధించిన అమ్మాయిని ప్రేమించిందని కారణం తోటి ప్రేమించిన దళిత మాదిగ బిడ్డ చంద్రశేఖర్ అన్న రాజశేఖర్ ను తీసుకెళ్లి కిరాతకంగా కొట్టి కాళ్లు చేతులు కట్టేసి చంపి అనంతరం పెట్రోల్ పోసి దహనం చేసినా రాజకీయ పార్టీలకు పట్టదా..? దళితులంటే మీకు లెక్క లేదా..? ఓట్ల కోసం ఊరేగింపుల కోసం దళితులు కావాలి కానీ వారిని సంపినా, ఏమైనా మౌనమే వహిస్తారా..? చనిపోయి ఐదు రోజులు అవుతున్న కనీసం వచ్చి చూడరా.. ఏం నీతి అని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పెంటనోళ్ళ నరసింహ మాదిగ ప్రశ్నించారు. ఎల్లంపల్లి హత్య విషయంలో రాజకీయ పార్టీల వైఖరిపై, పోరాటంలోకి రాకుండా, ప్రజాప్రతినిధులు, ప్రధాన రాజకీయ పక్షాలు కనీసం వచ్చే పరామర్శించకుండా చేస్తున్న నిర్లక్ష్యంపై ఎమ్మార్పీఎస్ తీవ్రంగా ఖండిస్తుందని తెలుపుతూ వారు మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులకు, ప్రధాన రాజకీయ పార్టీలకు కూడా దళితుల హత్యలు అంటరానివి అయ్యాయని మండిపడ్డారు. 24 గంటల్లో ప్రజా ప్రతినిధులు, ప్రధాన రాజకీయ పార్టీలు తక్షణమే బాధిత కుటుంబాన్ని పరామర్శించి భరోసా కల్పించకపోతే ప్రత్యక్ష పోరాటంలో కలిసి రాకపోతే కచ్చితంగా ఆపార్టీలను ఎమ్మార్పీఎస్ ప్రజాక్షేత్రంలో తేల్చుతుందని, భవిష్యత్తులో వారి వైఖరికి వ్యతిరేకంగా అందర్నీ కలుపుకొని పోరాటాన్ని కొనసాగించాల్సి వస్తుందని హెచ్చరించారూ. ఈ కార్యక్రమంలో అన్నెగల్ల ఆనంద్ మాదిగ, నాగభూషణ్ మాదిగ, బొబ్బిలి పాండు మాదిగ, నార్కుంట మహేందర్ మాదిగ, ఎర్రోళ్ల శ్రీనివాస్ మాదిగ, అప్పగల్ల రమేష్ మాదిగ ఆంజనేయులు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999